బ్యాంకర్లు బాధ్యతతో వ్యవహరించాలి

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన లబ్ధిదారులకు రుణాల మంజూరులో బ్యాంకర్లు బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన బ్యాంకర్లకు సూచించారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక జిల్లా కన్సల్టేటివ్ కమిటీ (డిసిసి) సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం, రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో నిర్దేశించిన తీర్మానాల మేరకే ప్రభుత్వ పథకాలకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. వాటిని బ్యాంకర్లు తిరస్కరించే పరిస్థితి ఉండకూడదని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడంలో తమకెంత బాధ్యత ఉందో బ్యాంకర్లకు కూడా అంతే బాధ్యత ఉందని తెలిపారు. క్షేత్రస్థాయిలో రుణాల మంజూరులో ఇబ్బంది కలిగించకుండా వ్యవహరించాలని బ్రాంచి మేనేజర్లకు ఆదేశాలివ్వాలని బ్యాంకు కంట్రోలింగ్ అధికారులకు సూచించారు. జగనన్న తోడుకు సంబంధించి జిల్లాలో 39 శాతం మాత్రమే రుణాలు మంజూరు చేశారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 104 శాతం రుణాలు మంజూరు చేస్తే, కర్నూలు జిల్లాలో మాత్రం చాలా తక్కువ మందికి రుణాలు మంజూరయ్యాయని తెలిపారు. రుణాల మంజూరులో ఎస్‌బిఐ, ఎపిజిబిలు వెనుకబడి ఉన్నాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు బ్యాంకులు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. తిరస్కరించే ప్రతి దరఖాస్తు వెనుక ఒక కుటుంబం ఉంటుందన్నారు. అవసరమున్న లబ్ధిదారులకు రుణం మంజూరు చేసి వారి జీవితాన్ని మార్చుకునే అవకాశం కల్పించాలని సూచించారు. ఈ రోజు సాయంత్రానికి జగనన్న తోడు దరఖాస్తులను అన్నింటినీ బ్యాంకులకు అందించాలని తెలిపారు. అందించినట్లుగా రశీదు పొందాలని డిఆర్‌డిఎ, మెప్మా పీడీలను ఆదేశించారు. టిడ్కో ఇళ్లకు రుణాల మంజూరులో కూడా ఎస్‌బిఐ, ఎపిజిబి, యూనియన్ బ్యాంకులు వెనుకబడి ఉన్నాయన్నారు. టిడ్కో ఇళ్లకు చెందిన దరఖాస్తులను బ్యాంకర్లు తిరస్కరించకుండా రుణాలు మంజూరు చేసేలా చూడాలని తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద గుర్తించిన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఎల్‌డిఎంను ఆదేశించారు. ఎల్‌డిఎం వెంకట నారాయణ, నాబార్డు డిడిఎం సుబ్బారెడ్డి, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

మానవతావాది శ్రీశ్రీ

- విద్వేషం కాదు... మానవత్వం కావాలి
- భాషను, భావాన్ని విప్లవీకరించిన వ్యక్తి శ్రీశ్రీ
- శ్రమైక జీవన సౌందర్యం శ్రీశ్రీ కవిత్వం
- జయ జయభేరి పుస్తకావిష్కరణలో ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

మానవతావాది శ్రీశ్రీ అని, సమాజాభివృద్ధికి ద్వేషం కాదని, మానవత్వం అవసరమని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి తెలిపారు. శ్రీశ్రీ 113వ జయంతి సందర్భంగా స్థానిక లలిత కళాసమితి (టిజివి కళాక్షేత్రం)లో సుందరయ్య విజ్ఞాన కేంద్రం సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో తెలకపల్లి రవి రచించిన శ్రీశ్రీజయభేరి 6వ ప్రచురణ పుస్తకావిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మొదట శ్రీశ్రీ చిత్రపటానికి తెలకపల్లి రవి, పలువురు ప్రముఖులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి జంధ్యాల రఘుబాబు పుస్తకాన్ని పరిచయం చేశారు. ఈ సందర్భంగా తెలకపల్లి రవి మాట్లాడారు. దేశంలో విద్వేషపూరిత రాజకీయాలు నడుస్తున్నాయని, ఇది దేశ ప్రగతికి ఆటంకమని పేర్కొన్నారు. దేశ రాజకీయంలో పాలకులు సామాన్యుల బాధలు కవిత్వీకరించిన శ్రామిక వాదిగా శ్రీశ్రీ నిలిచారని తెలిపారు. శ్రమ గురించి, దోపిడీ గురించి కార్ల్ మార్క్స్ సిద్ధాంతికరిస్తే, దానిని శ్రీశ్రీ కవిత్వీకరించారని చెప్పారు. నిస్తేజాన్ని పారతోలే ఉత్తేజం ఆయన కవిత స్వభావం అన్నారు. అనంతరం సుందరయ్య విజ్ఞాన స్ఫూర్తి కేంద్రం ఛైర్మన్ కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. శ్రీశ్రీ సాహిత్యం ఆలోచనను యువతలకు పరిచయం చేసే లక్ష్యంగా సుందరయ్య స్ఫూర్తి కేంద్రం నిత్యం పని చేస్తుందన్నారు. శ్రీశ్రీ జయంతి సందర్భంగా నగరంలో వ్యాసరచన, పాటలు, ఆటల పోటీలను నిర్వహించామని తెలిపారు. యువత ఉత్సాహంగా ముందుకొచ్చి ప్రతిభ చాటారన్నారు. జి.పుల్లయ్య విద్యాసంస్థల అధినేత పుల్లయ్య మాట్లాడుతూ... సామాన్యుల జనం జీవనానికి దగ్గరగా ఉన్న సాహిత్యం ఎప్పటికీ జీవిస్తుందన్నారు. అలాంటి కవిత్వం శ్రీశ్రీ సొంతమన్నారు. నేటి సామాజిక పరిస్థితుల నుంచి బయటపడేందుకు శ్రీశ్రీ పరిచయం తప్పనిసరి అన్నారు. కెవి.సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత డాక్టర్ కెవి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ... 1980లో కాకినాడ పిజి సెంటర్‌లో తాను విద్యనభ్యసిస్తున్నప్పుడు శ్రీశ్రీతో పరిచయం ఏర్పడిందని తెలిపారు. పీడిత జాతి జీవితాలే ఆయన కవిత ఇతివృత్తమని చెప్పారు. నేటి తరాన్ని శ్రీశ్రీ ఆలోచన స్రవంతిలోకి తీసుకురావాలన్నారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, వైద్య నిపుణులు డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ... శ్రీశ్రీ వ్యక్తి కాదు శక్తి అని, నిప్పు కణిక అని తెలిపారు. చందోపద్ధ కవిత్వం నుంచి నవ కవిత్వానికి నాంది పలికిన కవి శ్రీశ్రీ అన్నారు. ఆయన రాసిన పంక్తులు నేటికీ ప్రజల నాలుకలపై నాట్యమాడుతున్నాయని తెలిపారు. లలిత కళా సమితి అధ్యక్షులు పతి ఓబులయ్య మాట్లాడుతూ... 5 నిమిషాల్లో చిత్తు కాగితంపై మరో ప్రపంచం కవితను పేర్చిన మహాకవి శ్రీశ్రీ అని చెప్పారు. ఆయన జనకవిగా నిలిచారన్నారు. ప్రముఖ ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ భరత్ మాట్లాడుతూ... వామపక్ష ఉద్యమానికి దిక్సూచి శ్రీశ్రీ అన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. న్యాయనిర్ణేతలుగా యలమర్తి రమణయ్య, పార్వతయ్య, ఆశన్న వ్యవహరించారు. సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ జిఎన్.శేషయ్య, ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, పిఎన్ఎం జిల్లా అధ్యక్షులు ఎంపి.బసవరాజు, కార్యదర్శి ఎం.నాగరాజు, బాలోత్సవ ఛైర్మన్ డాక్టర్ బడేసాహెబ్, పిఎన్ఎం నాయకులు ఆశన్న, చిట్టి, ఏలియా, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్, విద్యార్థి సంఘం నాయకులు రంగప్ప, అబ్దుల్లా, అమర్, సాయి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తెలకపల్లి రవి

ఉత్తేజం నింపిన ఆటపాటలు

శ్రీశ్రీజయంతి సందర్భంగా నిర్వహించిన ఆటపాటల పోటీలు యువతలో ఆద్యంతం ఉత్తేజాన్ని నింపుతూ అలరించాయి. విద్యార్థులు పాడిన శ్రీశ్రీ రచన గేయాలు అభ్యుదయ భావంతో యువత, విద్యార్థుల్లో చైతన్యం నింపాయి. విద్యార్థులు చేసిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ప్రజా గాయకులు మహ్మద్ మియ్యా, చంద్రకంటి మద్దయ్య, బసవరాజు, ఆశన్న, మునిస్వామి ఆలపించిన అభ్యుదయ చైతన్య గీతాలు యువతలో ఉత్తేజాన్ని నింపాయి.

దేశ రక్షణ కోసం...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల, కార్మిక, కర్షక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తోంది. సామాన్యులపై భారాలు పెంచుతూ నడ్డి విరుస్తోంది. వంట గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలను అమాంతం పెంచేసింది. దాని ఫలితంగా నిత్యావసర సరుకుల ధరలు కూడా అంటుతున్నాయి. దీనిపై సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరి కార్యక్రమం జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. బిజెపికో హటావో దేశ్ బచావో నినాదంలో ఈ నెల 14 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బిజెపి ప్రభుత్వ విధానాలను జోరుగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. జిల్లావ్యాప్తంగా పలు పట్టణాల్లో, గ్రామాల్లో వామపక్ష నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కరపత్రాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. నగరంలో ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించారు. దేశాన్ని కాపాడుకోవాలంటే మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార భేరి కార్యక్రమం ఈనెల 30 వరకూ కొనసాగనుంది. ముగింపు సందర్భంగా పలు ప్రాంతాల్లో ముగింపు సభలు నిర్వహించారు.

అకాల వర్షం..అపార నష్టం

జిల్లాలో అకాల వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం బీభత్సవాన్ని సృష్టించింది. బలమైన ఈదురు గాలులు వీయడంతో పలు పంటలు నేలకొరిగాయి. మామిడి, బొప్పాయి కాయలు గాలివానకు రాలిపోయాయి. కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న ధాన్యం తడిసి ముద్దయింది. మిర్చి కోతకు రావడంతో కోసి ఆరబోసిన మిర్చి తడిసి పాడయింది. వరి పొలాల్లో నీరు చేరడంతో వరి పైరు నీట మునిగింది. అకాల వర్షంతో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

కొనసాగుతున్న యువగళం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొనసాగుతోంది. తొలుత డోన్ నియోజకవర్గంలోకి ప్రవేశించిన యాత్ర పత్తికొండ, ఆలూరు, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో ముగిసింది. ప్రస్తుతం ఎమ్మిగనూరు నియోజకవర్గంలో సాగుతోంది. అడుగడుగునా ప్రజలు లోకేష్‌కు తమ సమస్యలను విన్నవిస్తున్నారు.

ఇంటర్ లో అంతంతే...

ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించిన ఫలితాల్లో ప్రథమ సంవత్సర ఫలితాల్లో 56 శాతం మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 66 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాలకు సంబంధించి ఉమ్మడి జిల్లా 8వ స్థానంలో, రెండో సంవత్సరం ఫలితాలకు సంబంధించి పదో స్థానంలో నిలిచింది. ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలకు 29,772 మంది విద్యార్థులు హాజరు కాగా 16,638 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 26,980 మంది విద్యార్థులు హాజరు కాగా 17,719 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.



బిజెపిని గద్దె దింపుదాం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కోడుమూరు

ప్రజావ్యతిరేక, మతోన్మాద విధానాలను అవలంభిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం కోడుమూరు పట్టణంలోని పాత బస్టాండ్ ఆవరణలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరి పాదయాత్ర ముగింపు సందర్భంగా బహిరంగ సభ నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి గఫూర్‌మియా, సిపిఐ మండల కార్యదర్శి బి.రాజు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా వి.వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు నారాయణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని తెలిపారు. ఇది అన్యాయమని అడిగిన వారిపై కేంద్ర ప్రభుత్వం అనేక దుర్మార్గాలకు పాల్పడుతూ, వారిపై అక్రమ కేసులు బనాయిస్తోందని విమర్శించారు. దేశంలో ఉన్న ప్రజా సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను, ఓడరేవులను, చివరికీ అందరికీ అన్నం పెట్టే వ్యవసాయాన్ని సైతం ప్రయివేట్ రంగ సంస్థల అధిపతులైన అదాని, అంబానీలకు ధారదత్తం చేస్తోందని మండిపడ్డారు. మోడీ అండదండలతో అదాని ఏవిధంగా ప్రపంచాన్ని మోసం చేసి రూ.లక్షల కోట్లు కొల్లగొట్టారో, హిండెన్ బర్గ్ నివేదిక బట్టబయలు చేసిందని తెలిపారు. దేశంలోని అడవులను, భూములను, విద్యుత్ ప్రాజెక్టులను కార్పొరేట్లకు అక్రమంగా కట్టబెడుతోందని చెప్పారు. పేదలకు, సామాన్యులకు అండగా ఉంటామని, పేదల కోసమే తమ ప్రభుత్వం పని చేస్తుందని అధికారంలోకి రాకముందు కబుర్లు చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై భారాలు మోపిందని విమర్శించారు. ఇప్పటికే పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుల బతుకుల్లో మంటలు రాజేస్తున్నాయని తెలిపారు. నిరుద్యోగుల బతుకులు అగాధంలోకి జారిపోయాయని, కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడం లేదని చెప్పారు. పేదలకు విద్య, వైద్యం అందనంతా ఖరీదు అయ్యాయని తెలిపారు. ఎన్నో త్యాగాలు చేసి సాధించి తెచ్చుకున్న ఉపాధి హామీ చట్టాన్ని సైతం మోడీ ప్రభుత్వం అటకెక్కించిందని చెప్పారు. దేశంలో మహిళలకు రక్షణ లేదని, దాడులు, అత్యాచారాలు పెద్ద ఎత్తున పెరిగిపోయాయని తెలిపారు. దళిత, గిరిజనుల సంక్షేమానికి సామాజిక న్యాయం దూరమైందని చెప్పారు. కులవిద్వేషం, పెత్తందారితనం, మనువాద శక్తులతో పెట్రేగి పోతున్నాయని, మతకలహాలు, వివాదాలు రేపుతున్నాయని విమర్శించారు. ప్రజలను చైతన్య పరిచేందుకు, బిజెపి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు ఈ ప్రచార భేరి నిర్వహించామని తెలిపారు. అనంతరం ప్రజానాట్యమండలి కళాకారులు తమ పాటలతో బహిరంగ సభలో ప్రజలను, కార్యకర్తలను చైతన్యపరిచారు. సిపిఎం నాయకులు రాజు, బజ్జీల వీరన్న, జీతూరి వీరన్న, కరీం బాషా, సిపిఐ పట్టణ కార్యదర్శి రాముడు, సహాయ కార్యదర్శి మధు, ఎఐటియుసి నాయకులు దూల భాస్కర్, సాగర్, గుప్తా నగర్ కాలనీవాసులు వెంకట రాముడు, శేఖర్, మహిళలు సులోచనమ్మ, బాలమ్మ, సావిత్రమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

బహిరంగ సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న గిడ్డయ్య

ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ఎజిఎం మురళీకృష్ణ, డీన్‌లు సరళ, బాలాజీ

జెఇఇ మెయిన్స్‌లో శ్రీ చైతన్య విజయకేతనం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జెఇఇ మెయిన్ పరీక్ష ఫలితాలలో శ్రీ చైతన్య కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో విజయకేతనం ఎగురవేశారు. ఈ సందర్భంగా అద్భుతమైన ప్రతిభ కనబరచిన విద్యార్థిని, విద్యార్థులను శ్రీ చైతన్య కళాశాలల ఎజిఎం మురళీకృష్ణ, డీన్‌లు సరళ , బాలాజీ అభినందించారు. అనంతరం ఎజిఎం. మురళీకష్ణ మాట్లాడారు. చైతన్య విద్యార్థులకు మరెవ్వరూ సాటిలేరని ప్రస్తుత ఫలితాలతో మా కళాశాల విద్యార్థులు నిరూపించారని కొనియాడారు. జాతీయ స్థాయిలో వివిధ కేటగిరీలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు. ఎన్.కోమల్ 750వ ర్యాంకు, ఎన్ రాహిల్ 1359వ ర్యాంకు, బి.జయసాయి 1614వ ర్యాంకు, పి.జోయల్ 3820 వ ర్యాంకు, జె. అక్షయరావు 5706వ ర్యాంకు, పి. కేదార్నాథ్ 5720వ ర్యాంకు, సి. సురేంద్ర 5790వ ర్యాంకు లాంటి మరెన్నో ఉత్తమ ర్యాంకులు సాధించారు. జె.యి.యి. అడ్వాన్స్‌డ్ 127 మంది తమ విద్యార్థులు అర్హత సాధించారన్నారు. ఇవి కేవలం కర్నూలు శ్రీ చైతన్య నుండి మాత్రమే సాధించారని తెలిపారు. కళాశాలలో జరిగిన అభినందన సభలో ఈ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించడంతో పాటు రాబోయే నీట్ , అడ్వాన్స్‌డ్ ఫలితాలలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.


మార్కెట్ యార్డులో దుకాణ సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి

వ్యవసాయ మార్కెట్‌లో దుకాణాలు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్ : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో నూతనంగా నిర్మించిన 15 దుకాణ సముదాయాలను సానువారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రంభూపాల్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం యార్డును సందర్శించి అక్కడ జరుగే అభివృద్ధి పనులను పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్ర కేంద్రాలను ప్రారంభించారు. అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి గోవిందు, ఉపాధ్యక్షులు భీమేశ్వర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు కేశవ రెడ్డి, జయమ్మ, రామకృష్ణారెడ్డి, లక్ష్మీదేవి, ప్రభావతీ, సుజాత, మహబూబ్‌బాషా, ఇమ్మనియేల్, స్వేత పార్వతి, విజయ లక్ష్మి, ఇబ్రహిం, రంగన్న, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్‌గాజుల స్వేత, కమిషన్ ఏజెంట్లు , వ్యాపారస్తులు పాల్గొన్నారు.

వైసిపి పాలనకు చరమగీతం పాడుదాం : నారా లోకేష్

నందవరం మండలంలో ప్రజల నీరాజనం- రైతులతో నారా లోకేష్ ముఖాముఖి

ప్రజాశక్తి- ఎమ్మిగనూరు/నందవరం

రాష్ట్రంలోని ప్రజలందరూ వైసిపి పాలనకు చరమగీతం పాడాలని తెలుగుదేశం పార్టీ జాతీయ యువ నాయకుడు నారా లోకేష్ పిలుపునిచ్చారు. గత రెండు రోజులుగా నందవరం మండలంలో కొనసాగుతున్న నారా లోకేష్ "యువ గళం " పాదయాత్ర శనివారంతో ముగిసింది. నారా లోకేష్ యువగలం పాదయాత్రకు భారీ స్పందన లభించింది. నందవరం మండలంలో గ్రామ గ్రామాన నారా లోకేష్‌కు టిడిపి నాయకులు, కార్యకర్తలు ,ప్రజలు నీరాజనాలు పలికారు. ముగతి గ్రామంలో రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నందవరం మండల టిడిపి నాయకులు ఈరన్న గౌడ్, పుష్పావతి, దేశాయి మాధవరావు వారి వారి అనుచర వర్గంతో నారా లోకేష్‌కు ఘన స్వాగతం పలికి ప్రజా సమస్యలపై ప్రజలతో వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ ప్రజలందరూ భవిష్యత్తులో తెలుగుదేశం పార్టీ పగ్గాలు చేపట్టే విధంగా కృషి చేయాలని, అప్పుడే మన రాష్ట్రం అభివద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో నేటి వరకు నిరుద్యోగులను నట్టేట ముంచుతూ ప్రభుత్వ ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకుండా మాయమాటలతో మోసం చేస్తున్నాడన్నారు. చివరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఒక సైకోగా మారాడన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తుగ్లక్ పాలన సాగిస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు టిడిపినియోజకవర్గ ఇన్‌ఛార్జి , మాజీ ఎమ్మెల్యే బివి.జయ నాగేశ్వర్‌రెడ్డి, నందవరం మండలం టిడిపి నాయకులు ఈరన్న గౌడ్ , కాసింవలి ,నాగరాజుగౌడ్ పుష్పావతి, దేశాయ్ మాధవరావు, వెంకట్రామిరెడ్డి ,గడ్డం నారాయణరెడ్డి, వడ్డే గోపాల్, ఈరన్న ,జబ్బార్, చిన్న రాముడు, గోపాల్, పెద్ద రాముడు, నారాయణరెడ్డి ,వీరేష్ వివిధ గ్రామాల టిడిపి నాయకులు, కార్యకర్తలు ,ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.

యువగళం యాత్రలో నారాలోకేష్, బివి.జయనాగేశ్వర్‌రెడ్డి , తదితరులు

'ఉపాధి హామీ' రక్షణ కోసం ఉద్యమం

మే 5 నుండి 17 వరకు కలెక్టరేట్ల ముట్టడి

వ్యకాసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-తుగ్గలి

గ్రామీణ ఉపాధి హామీ పథకం నిర్వీర్యంకు కేంద్ర ప్రభుత్వ కుట్రలు చేస్తుందని, ఈ కుట్రలను నిరసిస్తూ పోరాటాల ద్వారా ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందామని, మే నెల 5 నుంచి 17 వరకు జరుగు కలెక్టరేట్ల ముట్టడిని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. తుగ్గలి మండలం రాంపల్లి గ్రామంలో శనివారం ఆయన ఉపాధి హామీ పనులు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకం పై కుట్ర జరుగుతుందన్నారు. పేద ప్రజలకు బడుగు బలహీన వర్గాలకు ఆర్థిక ఆసరాగా ఉన్నటువంటి ఈ చట్టాన్ని ఎత్తివేయాలని కుట్ర జరుగుతున్నదని దీన్ని కాపాడేందుకు ఐక్యంగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూడా జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముట్టడి కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. తద్వారా ఉపాధి చట్టం పనులను రక్షించుకునేందుకు అందరూ కృషి చేయాలన్నారు. పోరాటం ద్వారానే అందరికీ పని దొరుకుతుందని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు శ్రీనివాసులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

తుగ్గలి మండలం రాంపల్లి గ్రామంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వి.వెంకటేశ్వర్లు

జెఇఇ మెయిన్స్‌లో మెరిసిన విద్యార్థులు

ఉత్తమ ర్యాంకులు కైవసం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జెఇఇ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు.ప్రభుత్వ , ప్రైవేటు కళాశాలలోకి చెందిన విద్యార్థులు జెఇఇ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులను సాధించారు. ఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపి అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు.

చిన్నటేకూరు అకాడమి విద్యార్థులు ప్రతిభ

చిన్నటేకూరు సాంఘిక సంక్షేమ గురుకుల అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు డైరెక్టర్ డివి.రామసుబ్బారెడ్డి వెల్లడించారు. ఈ ఆకాడమీకు చెందిన పదిమంది విద్యార్థులు 90శాతం పర్సంటేజ్ సాధించి నట్లు ఆయన వెల్లడించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన సాధించిన విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి ప్రవీణ్ 1705, గౌతమ్ నాయక్ 1708, ఆవన్ కుమార్ 1766, కిరణ్ కుమార్ 1813, లోకేష్ నాయక్ 2378, తరుణ్ 3860, కృపారావు 4272, రాజు 4717, విద్యాసాగర్ 4727, రమేష్ నాయక్ 5532 ర్యాంకులు సాధించినట్లు డైరెక్టర్ వెల్లడించారు.

టౌన్ మోడల్ కళాశాల విద్యార్థి ప్రతిభ

జెఇఇ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో టౌన్ మోడల్ కళాశాల చెందిన విద్యార్థి చరణ్ కార్తీక్ 98 శాతంపైగా పర్సంటేజ్ సాధించి జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ సి సుంకన్న పేర్కొన్నారు. తమ కళాశాల విద్యార్థికి జెఇఇ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో అర్హత సాధించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

లోకేష్ దళితులకు క్షమాపణ చెప్పాలి

లేదంటే యువగళం యాత్రను అడ్డుకుంటాం

ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : దళితులను అవమానపరిచిన టిడిపి నాయకులు నారా లోకేష్ దళితులకు వెంటనే క్షమాపణ చెప్పాలని లేదంటే నియోజకవర్గంలో అడుగు పెట్టనీయబోమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరుదొడ్డి సుధాకర్ అన్నారు. కర్నూలు స్టాంటాన్ పురం వైసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ "జగనన్నే మా భవిష్యత్తు" కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారుగా 1.40కోట్ల కుటుంబాలు భాగమయ్యాయని,1.10కోట్ల మంది తమ మొబైల్ నుంచి జగనన్న ప్రభుత్వానికి మద్దతు తెలియజేస్తూ, మిస్డ్ కాల్‌ను ఇచ్చారన్నారు. కోడుమూరు నియోజకవర్గ అభివృద్ధి నిమిత్తం నియోజకవర్గ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా దాదాపుగా రూ.300 కోట్ల నిధులను సిఎం జగనన్న సహకారంతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టామని అన్నారు. కోడుమూరు పట్టణంలో ఇప్పటి వరకు పాలించిన బడా నాయకులు కోడుమూరు పట్టణ వాసుల దాహార్తిని కూడా తీర్చలేక పోయారని, కానీ తాము చెప్పిన మాట ప్రకారం దీర్ఘకాలికంగా ఉన్న కోడుమూరు పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కోసం రూ.30 కోట్లను సీఎం జగనన్న మంజూరు చేయడంతో ఇక్కడి బడా నాయకులు ఓర్చుకోలేక పోతున్నారని అన్నారు. నారా లోకేష్ తన యువగళం పాదయాత్రలో దళితుల గురించి మాట్లాడుతూ దళితులు ఏం పీకారంటూ అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం దారుణం అన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్

'గడపగడపకు' ద్వారా సమస్యలు పరిష్కారం

- వైసిపి రాష్ట్ర యువ నేత ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

పథకాలను వివరిస్తున్న ప్రదీప్‌రెడ్డి

వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'గడపగడపకు మన ప్రభుత్వం' ద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని వైసిపి రాష్ట్ర యువనేత వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. శనివారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు చిలకలడోన గ్రామంలో మూడో రోజు 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లో తిరుగుతున్న సమయంలో డ్రెయినేజీ, సిసి రోడ్లు, పలు సమస్యలను ప్రజలు ప్రదీప్ రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఇంటింటికీ తిరిగి లబ్ధిదారులకు అందించిన పథకాలను చదివి వినిపించారు. బుక్ లెట్‌ను అందజేసి ముందుకు సాగారు. అనంతరం సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, ఇన్‌ఛార్జీ విశ్వనాథ్ రెడ్డి, ఛైర్మన్ వెంకట్ రెడ్డి, సిఇఒ వెంకటేష్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు వెంటనే ప్రారంభించాలి

- వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు లింగన్న

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మాట్లాడుతున్న నాయకులు, గ్రామస్తులు

మండలంలోని చాగి పంచాయతీ పరిధిలో తక్షణమే ఉపాధి హామీ పనులు ప్రారంభించాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న డిమాండ్ చేశారు. శనివారం ఆయన గ్రామాల్లో పర్యటించి ఉపాధి కూలీలతో మాట్లాడారు. చాగి పంచాయతీలో ఉపాధి పనులు కల్పించకుండా ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. తక్షణమే ఉపాధి పనులు కల్పించాలని కోరారు. కూలీలు పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నా పనులు కల్పించడం లేదన్నారు. గ్రామంలో వివిధ కారణాలతో ఉపాధి పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహించడం సరైంది కాదని తెలిపారు. ఈ విషయంలో ఎపిఒ, ఎంపిడిఒ చొరవ తీసుకొని వెంటనే గ్రామంలో పనులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉపాధి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

విగ్రహ ప్రతిష్టాపనకు రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి - కోసిగి రూరల్

కమిటీ పెద్దలకు నగదు అందజేస్తున్న అర్జున్

మండలంలోని ఐరనగల్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్టాపనకు కోల్మాన్ పేట గ్రామానికి చెందిన యువ నాయకులు ఉప్పలపాటి అర్జున్ విరాళం అందజేశారు. శనివారం వాల్మీకి పెద్దలకు, వాల్మీకి యూత్ సభ్యులకు రూ.10 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడారు. రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి కారణ జన్ముడని తెలిపారు. విరాళం అందజేసిన అర్జున్‌ను గ్రామస్తులు అభినందించారు. సర్పంచి మేకల రామాంజనేయులు వాల్మీకి పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

వేసవిలో విద్యార్థుల పట్ల జాగ్రత్త తప్పనిసరి

- మదర్ థెరిస్సా యువజన సంఘం

ప్రజాశక్తి - కోసిగి రూరల్ + వేసవిలో విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని మదర్ థెరిస్సా యువజన సంఘం అధ్యక్షులు నజీర్ తెలిపారు. శనివారం మండలంలోని సాతనూరు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ నాయకులు నజీర్ మాట్లాడారు. వేసవిలో ఎండల నుంచి విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, నదులకు, బావులకు పంపించకుండా జాగ్రత్త వహించాలని కోరారు. 1 నుంచి 5వ తరగతి మధ్య పిల్లలకు బడిలో ఉచిత ట్యూషన్ ఏర్పాటు చేశామని, ట్యూషన్‌కు విద్యార్థులను హాజరు చేయించాలని తెలిపారు. ట్యూషన్ చెప్పే వారికి గ్రామ యువకులు పారితోషికం ఇస్తారని, తల్లిదండ్రులు ఎలాంటి డబ్బులూ ఇవ్వాల్సిన అవసరం లేదని చెప్పారు.

మాట్లాడుతున్న యువజన సంఘం నాయకులు

బిజెపిని అంతమొందిద్దాం...

- నరేంద్ర మోడీ నుంచి దేశాన్ని పరిరక్షించుకుందాం
- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయి

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ ముగింపు సభలో మాట్లాడుతున్న గౌస్ దేశాయి

దేశంలో కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పని చేస్తూ, మతోన్మాద విధానాలను అనుసరిస్తూ, మైనార్టీ, దళిత వర్గాలపై దాడులకు పాల్పడుతున్న నరేంద్ర మోడీ పాలనను అంతమొందించేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయి కోరారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై వామపక్షాల ఆధ్వర్యంలో ప్రచార భేరి నిర్వహించారు. శనివారం ముగింపు సందర్భంగా దేవనకొండలో సిపిఐ మండల కార్యదర్శి నరసారావు, సిపిఎం నాయకులు యూసుఫ్ బాష, సూరి, బజారి ఆధ్వర్యంలో సిపిఎం, సిపిఐ కార్యకర్తలు స్థానిక బస్టాండ్ నుంచి ప్రధాన రహదారుల గుండా ర్యాలీ చేపట్టి, ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్‌దేశాయి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వీరశేఖర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిలేటి శెట్టి మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తోందని విమర్శించారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరను పెంచి ప్రజలపై భారాలు మోపిందని మండిపడ్డారు. నరేంద్ర మోడీ విధానాలను ప్రశ్నించాల్సిన అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి అధినేతలు అనుకూలంగా వ్యవహరించడం దారుణమని విమర్శించారు. వామపక్ష నాయకులు అశోక్, గాజుల శ్రీనివాసులు, మహబూబ్ బాషా, ఓంకార్, నాగేష్, అస్లాం బాష, వెంకటేశ్వర్లు, నెట్టికల్లు, హరిశ్చంద్ర, దస్తగిరి, బడేసాబ్ పాల్గొన్నారు.

పెద్దకడబూరు : ప్రజా వ్యతిరేక, మతోన్మాద విధానాలను అవలంభిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు కోరారు. పెద్దకడబూరులోని పోలీసు స్టేషన్ నుంచి బస్టాండ్ ప్రారంభం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరిస్తోందని విమర్శించారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరను పెంచి ప్రజలపై భారాలు మోపిందని మండిపడ్డారు. ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని కోరారు. సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, సిపిఐ మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు పరమేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, శ్రీనివాసులు, రాజు పాల్గొన్నారు.

పెద్దకడబూరులో ప్రచార భేరి నిర్వహిస్తున్న నాయకులు

ఆదోనికి 22వ స్థానం సంతోషకరం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

'జగనన్న మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో ఆదోని నియోజకవర్గం రాష్ట్రంలో 22వ స్థానం ఉండడం సంతోషకరమని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మెగా సర్వేలో, జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో కోటి కుటుంబాలను కలిశామని తెలిపారు. వివిధ సంక్షేమ పథకాలు ఇంటి ముంగిట్లో, నేరుగా బ్యాంకు ఖాతాల్లో వస్తున్నందుకు ప్రజలు ధన్యవాదాలు తెలిపారని చెప్పారు. వారందరూ మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. దాదాపు 1.45 కోట్ల కుటుంబాలను వైసిపి సర్వే చేయడం, దేశంలోనే రాష్ట్రంలో ప్రభుత్వంపై ఇలాంటి పెద్ద సర్వే చేయడం ఇదే మొదటి సారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కుల, మత, ప్రాంతాలకతీతంగా, టిడిపి బలంగా ఉన్న ప్రాంతంలో కూడా సర్వే చేసినట్లు తెలిపారు. మున్సిపల్ ఛైర్మన్ శాంత, వైస్ ఛైర్మన్ నరసింహులు, కౌన్సిలర్ సందీప్ రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధిని మరిచిన వైసిపి

- జనసేన ఇన్‌ఛార్జీ వెంకప్ప

ప్రజాశక్తి - దేవనకొండ

రాష్ట్రంలో అధికారం చేపట్టి నాలుగేళ్లు గడిచినప్పటికీ అధికార వైసిపి ప్రభుత్వంలో ఎలాంటి అభివృద్ధి పనులూ చేపట్టలేదని జనసేన పార్టీ ఆలూరు ఇన్‌ఛార్జి తెర్నేకల్ వెంకప్ప విమర్శించారు. శనివారం మండలంలోని కప్పట్రాళ్ల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా పలు కాలనీలో తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో బురద పేటలో డ్రెయినేజీ లేక మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోందని తెలిపారు. జొల్లు కాలనీలో తాగడానికి నీరు రాక నెల రోజుల కావస్తున్నా పట్టించుకునే నాయకుడు లేడని ఆయన దృష్టికి తెచ్చారు. ఆలూరు నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరాం చేసిన అభివృద్ధి శూన్యమని, రానున్న రోజుల్లో జనసేన పార్టీని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. జనసేన పార్టీ నాయకులు మక్బుల్, ఆంథోని, నందు, బడేషావలీ, షేక్షావలీ, ఇస్మాయిల్, కౌలుట్ల, అబ్బాస్, చందు, కృష్ణ, రంగస్వామి పాల్గొన్నారు.

కప్పట్రాళ్ల గ్రామంలో పర్యటిస్తున్న జనసేన వెంకప్ప

ఘనంగా 'సెయింట్ మదర్ థెరిస్సా' వార్షికోత్సవం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని ఎన్‌టిఆర్ నగర్‌లో ఉన్న సెయింట్ మదర్ థెరిస్సా పాఠశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్స్ హెప్సిబా మాట్లాడారు. విద్యార్థులు విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. అప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని తెలిపారు. తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చిపెట్టే విధంగా విద్యార్థినుల నడవడిక ఉండాలన్నారు. పది మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తామన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వార్షికోత్సవం నిర్వహిస్తున్న యాజమాన్యం

వేసవిలో పిల్లల పట్ల అప్రమత్తత అవసరం

- ఇస్వి ఎస్ఐ విజయలక్ష్మి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వడంతో పిల్లలను బయట తిరగనివ్వకుండా, తల్లిదండ్రులు పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇస్వి ఎస్ఐ విజయలక్ష్మి తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో పిల్లలు వేసవి సెలవుల కారణంగా చట్ట విరుద్ధమైన ఆటలు ఆడకుండా తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని తెలిపారు. వేసవిలోనే పిల్లల మరణాలు ఎక్కువగా ఉంటున్నాయన్నారు. ఎలాంటి ప్రమాదాలూ సంభవించకుండా చెరువులు, కాలువలు, బావులు, నీటి కుంటల దగ్గరికి ఈత కొట్టడానికి పంపవద్దని సూచించారు. ప్రమాదాలు జరిగిన తర్వాత బాధ పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే పిల్లలు ద్విచక్ర వాహనాలతో మరణించిన సంఘటనలూ ఎన్నో ఉన్నాయని, ఆ విషయాలను దృష్టిలో పెట్టుకొని ద్విచక్ర వాహనాలను ఇవ్వొద్దని సూచించారు. వేసవి సెలవులు పూర్తయి, తిరిగి పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి చదువు పట్ల మరికొంత ఆసక్తి పెరిగే విధంగా, మేధాశక్తి పెంచుకోవడానికి తగిన విషయాలు నేర్పించాలని తెలిపారు. కాలయాపన చేయకుండా, తల్లిదండ్రులు పిల్లలపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలన్నారు.

సెలవులొచ్చాయ్.. జాగ్రత్త..!

- సెలవుల్లో జాగ్రత్తగా ఉండాలి - తల్లిదండ్రులకు పిల్లలపై నిఘా ఉండాలి - సూచిస్తున్న ఉపాధ్యాయులు
- బంధువుల ఊళ్లకు వెళ్లినప్పుడు జాగ్రత్తలు అవసరం - వాగులు, వంకలు, బావుల దగ్గరకు వెళ్లకుండా జాగ్రత్తలు

ప్రజాశక్తి - చిప్పగిరి

'చదువులు ముగిశాయి. ఇక సెలవుల్లో ఆడిందే ఆట.. పాడింది పాట' అని విద్యార్థులు చాలా సంబరపడి పోతుంటారు. అన్ని సమయాలూ మనకు అనుకూలంగా ఉండవు. అది తెలుసుకోవాలని పిల్లల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు సూచనలు చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఒక సమూహంగా ఏర్పడి ఎక్కడపడితే అక్కడ తిరుగుతూ తల్లిదండ్రులకు తెలియకుండా వెళ్తుంటారు. ప్రతి తల్లిదండ్రులు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, పిల్లలకు ఏదైనా జరగరానిది జరిగితే వారి జీవితకాలం మనోవేదన చెందుతారు. ముందు జాగ్రత్తగా పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు, ఏం చేస్తున్నారనే దానిపై పూర్తి నిఘా పెంచే బాధ్యత తల్లిదండ్రులపై ఉంది. పాఠశాలలో చదువుకుంటున్న వరకు పిల్లలపై సర్వహక్కులు ఉపాధ్యాయులకు ఉంటాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. విద్యార్థులు చాలా వరకు సెలవుల్లో వాగులు, వంకల్లో ఎవరు ఎక్కువగా ఈత కొట్టుకుంటూ ఎంత దూరం వెళ్తున్నామని పందేల కాస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరమని తల్లిదండ్రులు తెలుసుకోవాలి. అలాగే చెట్లు ఎక్కడం, తేనె ఉందని వెళ్లడం ప్రమాదకరమని తెలిసినా అలాగే చేస్తుంటారు. సెలవుల్లో చాలా సంఘటనలు జరిగి తల్లిదండ్రులకు శోకం మిగిల్చిన ఘటనలు చాలానే చూస్తున్నాం. పెద్దలు లేకుండా విహారయాత్రలకు వెళ్లడం కూడా మంచిది కాదని ప్రతి ఒక్కరూ పిల్లలు, తల్లిదండ్రులు తెలుసుకోవాలి. ముందు జాగ్రత్తలతో సెలవులు అయిపోయేంత వరకు తగిన సూచనలిచ్చి వారిపై గట్టి నిఘా ఉంచి చూసుకోవాలని తల్లిదండ్రులను ఉపాధ్యాయులు కోరుతున్నారు.

బావి ఈత కొడుతున్న పిల్లలు

తల్లిదండ్రులు చూసుకోవాలి

- నాగభూషణం రెడ్డి. ఉపాధ్యాయుడు, నగరడోనా

పాఠశాలలో చదువుకున్న రోజులన్నీ మా పరిధిలో ఉంటాయని విద్యార్థులు మేము చెప్పినట్లు వింటుంటారు. సెలవుల్లో విద్యార్థులు ఎక్కడపడితే అక్కడ తిరుగుతూ వంకలు, బావుల్లో ఈతకు వెళ్లి పందేలు వేసుకుని ఎవరు ఎక్కువ ఈత కొడతారో వారే గెలిచినట్లు చేస్తుంటారు. తల్లిదండ్రులు ఇవన్నీ గమనించి విద్యార్థులను ఈనెల రోజులు మంచి మాటలతో మీ దగ్గరే ఉండేలా చూసుకునే బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలి : డిఎస్ఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించే కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ధణాపురం ఉదయ్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉదయ్ మాట్లాడారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో సెలవు దినాల్లో తరగతులు నిర్వహించి విద్యార్థులను ఒత్తిడికి గురి చేయడం మంచి కాదన్నారు. ప్రభుత్వం ఫీజులు నిర్ణయించక ముందే అడ్మిషన్లు నిర్వహిస్తూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కితే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. డివిజన్ ఉపాధ్యక్షులు చిరు, సుమంత్, అరవింద్, కృష్ణ, మురళీ, బసవరాజు పాల్గొన్నారు.

నేడు ఘంటసాల సంగీత విభావరి

- ఘంటసాల సప్తస్వరాల కళా సమితి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని రెడ్డీస్ కల్యాణ మండపంలో ఘంటసాల సప్త స్వరాల కళా సమితి ఆధ్వర్యంలో ప్రముఖ గాయకులు సర్వ సామ్రాట్ డాక్టర్ టి.శరత్చంద్ర మిత్ర బృందం వారితో ఘంటసాల సంగీత విభావరిని ఆదివారం నిర్వహిస్తున్నట్లు గౌరవాధ్యక్షులు టి.ఆంజనేయులు, అధ్యక్షులు బి.నీలకంఠప్ప, ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.బసవరాజు తెలిపారు. శనివారం పట్టణంలోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణ ప్రజలు, కళాకారులు, కళాభిమానులు, కళా పోషకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

2284 టెట్రా ప్యాకెట్లు ధ్వంసం

ప్రజాశక్తి - దేవనకొండ

గత రెండు నెలల వ్యవధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన అక్రమ మద్యానికి సంబంధించిన 2284 టెట్రా ప్యాకెట్లను పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం దేవనకొండ క్రాస్, కుంకునూర్ రహదారి మధ్యలో పోలీసు వాహనంతో ధ్వంసం చేసినట్లు స్థానిక ఎస్ఐ భూపాలుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించే వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మద్యం తరలిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కుల నిర్మూలనే అంతిమ లక్ష్యం

- కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్‌బాబు

ప్రజాశక్తి - నందవరం

'బోధించు.. పోరాడు.. సమీకరించు' అన్న నినాదాలతో దేశానికి పట్టిన కులజాఢ్యంపై పోరాడిన డాక్టర్ అంబేద్కర్ కలలు కన్న కుల నిర్మూలనే కెవిపిఎస్ అంతిమ లక్ష్యమని కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.దేవసహాయం, ఎమ్‌డి.ఆనంద్ బాబు తెలిపారు. శనివారం మండలంలోని నది కొత్త కైరవాడి గ్రామంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో ప్రదర్శన చేపట్టారు. గ్రామ ప్రధాన రహదారి నుంచి ఎలిమెంటరీ స్కూల్ ముందు ఏర్పాటు చేసిన కెవిపిఎస్ జెండా స్తంభం వరకు డప్పులు, బాణసంచాతో ప్రదర్శన నిర్వహించారు. గ్రామ పెద్ద ఆనందరాజుతో జెండా ఆవిష్కరణ చేయించారు. అనంతరం థామస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో దేవ సహాయం, ఆనంద్ బాబు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.కరుణాకర్, హెచ్.జయరాజు, జిల్లా సహాయ కార్యదర్శి మామిడికాయల రాజు మాట్లాడారు. అంటరానితనం అంతం కెవిపిఎస్ పంతం అంటూ నేటికీ ఈ సమాజంలో కొనసాగుతున్న అనాగరిక విధానంపై వీరోచితమైన పోరును నిర్వహించాలని తెలిపారు. ఈ అసమానతలకు కారణమైన కుల వ్యవస్థను బద్దలు కొట్టాలన్నదే డాక్టర్ అంబేద్కర్ ఆశయమని చెప్పారు. కులం కారణంగా నేటికీ కొనసాగుతున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను రూపుమాపి కుల నిర్మూలనే లక్ష్యంగా కలిసి వచ్చే వారందరినీ కలుపుకొని ఉద్యమించాలని కోరారు. కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు ఆంథోని, నాగప్ప, రాజా రమేష్, గుంటెప్ప పాల్గొన్నారు.

కెవిపిఎస్ కైరవాడి గ్రామ కమిటీ ఎన్నిక

అనంతరం కెవిపిఎస్ ఎస్.కైరవాడి గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కెవిపిఎస్ గ్రామ అధ్యక్షులుగా సంధ్యపోగు ఆనందరాజు, ప్రధాన కార్యదర్శిగా మద్రి నరసన్న, ఉపాధ్యక్షులుగా మీనుగ రాజు, బిపిఎం.నరసన్న, సహాయ కార్యదర్శులుగా సూరి, కె.సుదర్శనం, కోశాధికారిగా హనుమంతు, కమిటీ సభ్యులుగా దేవదాసు, వసంత, ఎలీషా, నాగరాజు, ప్రసాద్, కుర్నీల్, వీరాంజనేయులు, రఘును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ బాబు

మేడేను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న

ప్రజాశక్తి - కౌతాళం

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య కోరారు. శనివారం సిపిఎం కార్యాలయంలో ప్రహ్లాద అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వివిధ కార్మిక సంఘాలైన, ఆటో, గ్రామ సేవకులు, అంగన్వాడీ, పంచాయతీ కార్మికులు, కెవిపిఎస్ తదితర సంఘాలు తరలిరావాలని కోరారు. కార్మికులంతా ఐకమత్యంతో హక్కులను సాధించుకోవడానికి పోరాటాలను సాగించాలన్నారు. నాగరాజు, వలీ, ఈరన్న పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఈరన్న

లోకేష్‌ను విమర్శించే స్థాయి ప్రదీప్ రెడ్డికి లేదు

- టిడిపి కర్నూలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

టిడిపి యువనేత నారా లోకేష్‌ను విమర్శించే స్థాయి వైసిపి నాయకులు ప్రదీప్ రెడ్డికి లేదని టిడిపి కర్నూలు పార్లమెంటు ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, చింతలగెని నర్సారెడ్డి తెలిపారు. శనివారం వారు కోసిగిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యువగళం పాదయాత్రలో భాగంగా కోసిగి బహిరంగ సభలో మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వారి కుటుంబ సభ్యుల అవినీతిపై లోకేష్ మాట్లాడారని తెలిపారు. ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ దమ్ముంటే 2024 ఎన్నికల్లో బాలనాగిరెడ్డిపై పోటీ చేయాలని చెప్పడం అవివేకమన్నారు. 2009 ఎన్నికల్లో బాలనాగిరెడ్డి టిడిపి తరఫున ఎమ్మెల్యేగా గెలిచి టిడిపికి వెన్నుపోటు పొడిచారని గుర్తు చేశారు. ఇప్పుడు టిడిపి అధినేత చంద్రబాబుపైనా, లోకేష్‌పైనా విమర్శలు చేయడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబును, లోకేష్‌ను విమర్శించే స్థాయి ప్రదీప్ రెడ్డికి ఎక్కడిదని ప్రశ్నించారు. ప్రదీప్‌రెడ్డి హోదా ఏమిటని, వైసిపిలో మంత్రాలయం ఎమ్మెల్యేగా గెలిచారా, నలుగురు ఎమ్మెల్యేలుగా గెలిచారా అని ఎద్దేవా చేశారు. నాలుగు మండలాల్లో నాలుగు కార్లకు ఎమ్మెల్యే స్టిక్కర్లు వేసుకొని తిరుగుతున్నారని తెలిపారు. గెలిచిన ఒక్క ఎమ్మెల్యే ఎక్కడున్నాడోనని, ఎమ్మెల్యేలుగా తిరుగుతూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. లోకేష్ మాట్లాడిన మాట నిజం కాదంటారా అని, మీరు అవినీతి చేయలేదా అని ప్రశ్నించారు. 2024లో ఎన్నికల్లో లోకేష్‌ను పోటీకి పిలిచారని, అంత దాకా ఎందుకని, మీపై పోటీ చేసేందుకు తాము, బీసీ నాయకులు చాలని తెలిపారు. 2024 ఎన్నికల్లో నియోజకవర్గంలో టిడిపి బీసీ నాయకులు అత్యధిక మెజార్టీతో గెలిచి తీరుతామని చెప్పారు. ఇప్పటికైనా ప్రదీప్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని ప్రజలకు సేవ చేసే మార్గంలో ఉండాలని హితవు పలికారు. పార్టీ అధి నాయకులను విమర్శించే స్థాయి లేదని తెలిపారు. 2024 ఎన్నికల్లో నియోజక వర్గంలో టిడిపి జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న ముత్తురెడ్డి, చింతలగేని నర్సారెడ్డి

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

- ఖాజీపుర వాసులు

ప్రజాశక్తి - ఆదోని

తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, సమస్యను పరిష్కరించాలని సచివాలయం చుట్టూ తిరిగినా పట్టించుకునే వారే లేరని ఖాజీపుర వాసులు వాపోయారు. పట్టణంలోని ఖాజీపుర వీధిలో పది రోజులుగా తాగునీరు సరఫరా చేయడం లేదని శనివారం స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రెండు రోజులకు ఒకసారి తప్పనిసరిగా నీరు సరఫరా చేస్తామని అధికారులు చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదని తెలిపారు. ఆ వీధికి కావాల్సిన తాగునీటికి పైపులు అందడం లేదని, పొంతన లేని సమాధానం చెబుతూ ఇతర సాకులు చూపి ఉద్యోగులు తప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కౌన్సిలర్ గట్టు ఇంతియాజ్ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా ఏరియాలో మసీదు ప్రాంతంలో నీటి ఎద్దడి ఉందని, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రెండు రోజుల్లో నీరు సరఫరా అయ్యేలా ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామని చెప్పారు. పట్టణ నడిబొడ్డున సమస్య ఇలా ఉంటే శివారు ప్రాంతాల్లో నివసించి వారి పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అధికారులు గ్రహించాలని స్థానికులు కోరుతున్నారు.

మాట్లాడుతున్న స్థానికులు

మండలంలో వర్షం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని కల్లుకుంట గ్రామంలో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. గ్రామానికి చెందిన హరిజన కర్రెన్న పొలం దగ్గర పిడుగుపడి వేప చెట్టు కాలిపోయింది. వేప చెట్టు పక్కన ఉన్న బండరాయి కూడా పగిలిపోయింది.

ADONI MUNICIPALITY

e-Procurement Tender Notice

Roc.No.04/2023-24-E1 **Dated : 29-04-2023**

Invites Tender Notice Under General Funds, 15th Fc 2021-22, ASC Grants, SAC 2018-19 Funds and GGMP Funds

Down loading Start date and Time : 01.05.2023 @ 5.00 PM
Down loading End date and Time : 16.05.2023 @ 3.00 PM

For further details the tenderer may visit e-procurement platform on **www.tender.apeprocurement.gov.in.** or Cell No.9849906650

Commissioner,
Adoni Municipality.

మహారాజశ్రీ కర్నూలు నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఓ.యస్.నెం.885/2022

కె.సుబ్రమణ్యం. ...వాది

- ఎదురి -

సి.సురేందర్ రెడ్డి. ...ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

సి.సురేందర్ రెడ్డి తండ్రి సి.వి నరసింహారెడ్డి, వ్యాపారము, ఇంటి. నెంబర్. 79-24, మేడపైన, కృష్ణానగర్, కర్నూలు.

పై నంబరు దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తం రూ.5,17,704/-లు ముందు వడ్డీ మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. సదరు దావాలో కోర్టు వారు ప్రతివాది అయిన నీకు ఆక్షేపణ ఉన్న తేదీ 09-05- 2023వ తేదీ పగలు 10:30 గంటలకువాయిదా ఉన్నది. పై తేదీ నాడు మీరు గాని మీ తరఫు వకీలు గానీ పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతరములు లేవని మీ పరోక్షమున పై దావాను విచారించి తీర్మానించ బడునని తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 09-05-2023

యనమల శ్రీనివాసులు,
వాదిపరం న్యాయవాది
కర్నూలు.

మహారాజశ్రీ కర్నూలు మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో
ఓ.యస్.నెం.1399/2021

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, కృష్ణానగర్ బ్రాంచ్, కర్నూలు రిప్రజెంటెడ్ బై ఇట్స్ మేనేజర్, కర్నూలు. ...వాది

-ఎదురి -

జ్ఞాన జ్యోస్ మరియు ఇద్దరు. ...ప్రతివాదులు

ప్రతివాదులకు దావా సమన్లు

1.జ్ఞాన జ్యోస్ భర్త నోబుల్ ప్రకాష్, ఫ్లాట్ నెంబర్. జి2, రాయల్ టవర్స్, నియర్ నేతాజీ కాంప్లెక్స్, కర్నూలు.
2.పానుగంటి సంజమ్మ భర్త నాగభూషణం, రిటైర్డ్ టీచర్, ఇంటి. నెం.50-58, ఆరోరా నగర్, కర్నూలు.
3.అవ్వరా ప్రసాద్ తండ్రి పెద్దపుల్లన్న, టీచర్, ఇంటి. నెంబర్. 45/24-2E, శివాలయం ఎదురుగా, అశోక్ నగర్, కర్నూలు.

పై నంబరు దావాలో వాది, ప్రతివాదులు నుండి దావా మొత్తం రూ.4,76,193/-లు రాబటు కొనుటకు పై కోర్టులో దావా దాఖలు చేసినారు. సదరు దావాలో కోర్టు వారు ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా రిజిస్టర్ పోస్టు ద్వారాను మీకు సమన్లు పంపినను మీరు సమన్లు తీసుకోనందున ఇందుమూలంగా మీకు తెలియజేయడం మేమనగా మీ హాజరు నిమిత్తము పై తెలిపిన కోర్టులో తేదీ 10-05-2023వ తేదీ పగలు 10:30 గంటలకు వాయిదా ఉన్నది. పై తేదీ నాడు మీరు గాని మీ తరఫు వకీలు గానీ పైకోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేనిచో మీకు ఎలాంటి అభ్యంతరములు లేవని మీ పరోక్షమున పై దావాను విచారించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా : 10-05-2023

బి.అమరనాథ్,
వాదిపరం న్యాయవాది,
కర్నూలు.

దేశ రక్షణ కోసం...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రెండో అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల, కార్మిక, కర్షక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తోంది. సామాన్యులపై భారాలు పెంచుతూ నడ్డి విరుస్తోంది. వంట గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ ధరలను అమాంతం పెంచేసింది. దాని ఫలితంగా నిత్యావసర సరుకుల ధరలు కూడా అంటుతున్నాయి. దీనిపై సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ప్రచార భేరి కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. బిజెపికో హటావో దేశ్ బచావో నినాదంతో ఈ నెల 14 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. బిజెపి ప్రభుత్వ విధానాలను జోరుగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు పట్టణాల్లో, గ్రామాల్లో వామపక్ష నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. కరపత్రాల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నారు. నగరంలో ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించారు. దేశాన్ని కాపాడుకోవాలంటే మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార భేరి కార్యక్రమం ఈ 30 వరకూ కొనసాగనుంది. ముగింపు సందర్భంగా పలు ప్రాంతాల్లో ముగింపు సభలు నిర్వహించారు.

అకాల వర్షం.. అపార నష్టం

జిల్లాలో అకాల వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం బీభత్సాన్ని సృష్టించింది. బలమైన ఈదురు గాలులు వీయడంతో పలు పంటలు నేలకొరిగాయి. మామిడి, బొప్పాయ కాయలు గాలివానకు రాలిపోయాయి. కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్న ధాన్యం తడిసి ముద్దయింది. మిర్చి కోతకు రావడంతో కోసి ఆరబోసిన మిర్చి తడిసి పాడయింది. వరి పొలాల్లో నీరు చేరడంతో వరి పైరు నీట మునిగింది. అకాల వర్షంతో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.

కొనసాగుతున్న యువగళం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొనసాగుతోంది. తొలుత డోన్ నియోజకవర్గంలోకి ప్రవేశించిన యాత్ర పత్తికొండ, ఆలూరు, ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో ముగిసింది. ప్రస్తుతం ఎమ్మిగనూరు నియోజకవర్గంలో సాగుతోంది. అడుగడుగునా ప్రజలు లోకేష్ కు తమ సమస్యలను విన్నవిస్తున్నారు.

ఇంటర్‌లో అంతంతే...

ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలలో ప్రథమ సంవత్సరం 56 శాతం మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం 66 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాలకు సంబంధించి ఉమ్మడి జిల్లా 8వ స్థానంలో, రెండో సంవత్సరం ఫలితాలకు సంబంధించి పదో స్థానంలో నిలిచింది. ప్రథమ సంవత్సర ఇంటర్మీడియట్ పరీక్షలకు 29,772 మంది విద్యార్థులు హాజరు కాగా 16,638 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సర పరీక్షలకు 26,980 మంది విద్యార్థులు హాజరుకాగా 17,719 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

స్వపక్షంలోనే విపక్షం..

- వాదోపవాదనల మధ్య కౌన్సిల్ సమావేశం
-నా వార్డు అభివృద్ధి చెందాలంటే ఎవరి కాళ్ళు పట్టుకోవాలో చెప్పండి - వైసిపి కౌన్సిలర్ కృష్ణమోహన్ ఆవేదన

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

'నా వార్డ్ అభివృద్ధి చేయకపోతే రాజీనామా చేస్తాను. అభివృద్ధి చేయాలంటే ఎవరి కాళ్ల పట్టుకోవాలో చెప్పండి' అని నంద్యాల పట్టణంలోని 25వ వార్డుకు చెందిన కౌన్సిలర్ కృష్ణమోహన్ కౌన్సిల్ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ మాబున్నిసా అధ్యక్షతన జరిగింది. సమావేశంలో 25వ వార్డు కౌన్సిలర్ మాట్లాడుతూ 20 నెలలు గడుస్తున్నా తమ వార్డులో ఒక్క అభివృద్ధి జరగలేదని, రూ.3 కోట్లు పనులకు ఆమోదం తెలిపినా ఒక్క పని జరగక పోవడం బాధ కలిగిస్తుందని, ప్రజలకు ఏమి సమాధానం చెప్పాలని చైర్మన్‌ను నిలదీశారు. ఛైర్మెన్ మాబున్నిసా వార్డ్, వైస్ చైర్మన్ పామ్‌షావలి వార్డులలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి కానీ మధ్యలో ఉన్న తన వార్డ్ ప్రజలు ఏమి పాపం చేశారో చెప్పాలన్నారు. పట్టణ ప్రజలు కడుతున్న ఇంటి, కుళాయి పన్ను డబ్బులు ఎక్కడికి పోయాయో అర్థం కావడంలేదని కొందరు కౌన్సిలర్లు ప్రశ్నించారు. చేసిన పనులకు కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించకపోవడంతోనే పనులు జరగడం లేదని, ఎమ్మెల్యే చెప్పినా తన వార్డులో ఒక్క పని కూడా జరగలేదని కౌన్సిలర్ శ్యామ్ సుందర్ లాల్ అసహనం వ్యక్తం చేశారు. అధికారులు చెప్పిన విధంగానే కాంట్రాక్టర్లు పనులు చేస్తున్నట్లు కౌన్సిల్ దృష్టికి చైర్మన్ తెచ్చారు.

25వ వార్డు సమస్యలపై ఏకరువు పెడుతున్న అధికార పార్టీ వైసిపి కౌన్సిలర్ కృష్ణమోహన్

వాదోపవాదనాల మధ్య సాగిన కౌన్సిల్ సమావేశం

20 ఏళ్లలో జరగని అభివృద్ధి ఇప్పుడే జరిగిందని అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు తెలిపారు. 15 ఏళ్ళ మీ నాయకులే కదా నంద్యాల మున్సిపల్‌లో అధికారంలో ఉండేది అంటూ తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్ మహబూబ్ వలి కౌంటర్ ఇచ్చారు. 20 ఏళ్లలో 15 ఏళ్ల శిల్పా కుటుంబమే నంద్యాలలో అధికారంలో ఉందని, మున్సిపల్ కౌన్సిల్‌లో కూడా మీ పార్టీ అధికారంలో ఉంది కదా అప్పుడు మీరే కదా చేయాల్సిందని ప్రశ్నించారు. అధికార కౌన్సిల్ సభ్యులు ఎదురు దాడికి దిగారు. దీంతో కొద్దిసేపు కౌన్సిల్ సమావేశం వాదనలు ప్రతివాదనాలతో గందరగోళంగా మారింది. అమృత్ స్కీం తెచ్చింది టిడిపి ప్రభుత్వంలోనేనని, అప్పట్లో పనులు కొంతవరకు జరిగాయని, ఈ నాలుగేళ్లలో స్థానిక ఎమ్మెల్యే పూర్తి చేయలేదన్నారు. కౌన్సిల్ సమావేశం ప్రారంభం కాగానే చైర్మన్ అజెండాలోని అంశాలను కౌన్సిల్ సమావేశం ముందు ఉంచి అన్నింటికీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కౌన్సిల్లో ప్రొజెక్టర్ ద్వారా అభివృద్ధి పనులను ప్రదర్శించారు. సమావేశంలో అధికార కౌన్సిలర్లు, ప్రతిపక్ష కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు కమిషనర్ రచంద్రారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ వెంకట దాస్, మున్సిపల్ ఇంజనీరు రమణమూర్తి, డిఈలు శ్రీనివాస్ రెడ్డి, జయ భరత్ రెడ్డి, మధు కుమార్, హెల్త్ ఆఫీసర్ డా. అంకిరెడ్డి, ఆర్ఒ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్, తదితరులు పాల్గొన్నారు.

మోడీని గద్దె దింపుదాం

- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మతోన్మాద, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ప్రజలు ముందుకు రావాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ప్రచార భేరి ముగింపు బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభకు సిపిఐ ఆళ్లగడ్డ కార్యదర్శి భాస్కర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కె.రామాంజనేయులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రశ్నించే ప్రతి ఒక్కరిపై నిరంకుశంగా కేసులు వేస్తూ, దాడికి పాల్పడుతూ అణచి వేస్తుందని అన్నారు. ధరలు ఆకాశన్నంటి, నిరుద్యోగుల బతుకులు అంధకారంలోకి జారిపోతున్నా, రైతుల ఆత్మహత్య చేసుకుంటున్నా పట్టించు కోవడం లేదని విమర్శించారు. కార్మికుల హక్కుల్ని కాలరాస్తుందని తెలిపారు. సిపిఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం సామాన్య ప్రజలకు అండగా ఉండటం పోయి వారి మీదే మోయలేని భారాలు వేస్తుందని విమర్శించారు. అంతకు ముందు ఎపి ప్రజానాట్య మండలి నంద్యాల జిల్లా కార్యదర్శి శివయ్య బృందం ఆలపించిన విప్లవ గీతాలు ప్రజలను అకటకున్నాయి. కార్యక్రమంలో సిపిఐ కార్యదర్శి భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, రైతు సంఘం డివిజన్ కార్యదర్శి నరసింహులు, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, సిపిఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నియంత్రణను సీరియస్‌గా తీసుకొని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్ నుండి మత్తు పదార్థాల నియంత్రణపై జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కోఆర్డినేషన్ కమిటీ నిర్వహించారు. జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ రమణ, ఇన్చార్జి డిఆర్ఓ కామేశ్వరరావు తదితర అధికారులు జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ, అటవీ, విద్య, ఆరోగ్య శాఖలు మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన అంశాలపై ఏదో చెప్పామన్న రీతిలో కాకుండా పూర్తిస్థాయి నివేదికలను సమర్పించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లోని కళాశాల విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగంపై జరిగే అనర్థాల గురించి సంపూర్ణ అవగాహన కల్పించాలని విద్యాసంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని వ్యవసాయ భూముల్లో అంతర్ పంటగా, అటవీ విస్తీర్ణంలోని దేవాలయాలు, దర్గాలు, కొండలు తదితర ప్రదేశాల్లో గంజాయి సాగు చేస్తున్న సమాచారాన్ని ఇవ్వాలన్నారు. శ్రీశైలం, మహా నంది, అహోబిలం పుణ్యక్షేత్రాలలో దేవస్థాన అధికారులు మత్తు పదార్థాల స్మగ్లింగ్ అరికట్టేందుకు తమ స్థాయిలో చర్యలు తీసుకోవాలని సూచించారు. విశాఖ నుండి రవాణా అయ్యే పార్సల్ వెహికల్స్, గూడ్స్ వెహికల్స్‌పై స్పెషల్ డ్రైవ్ పెట్టి నిఘా నిర్వహించాలని రవాణా అధికారులకు సూచించారు. జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల, ఆత్మకూర్, డోన్ ఆర్డీవోలు, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వైసిపిలో మరోసారి విభేదాలు..

ప్రజాశక్తి - పగిడ్యాల

అధికార వైసిపిలో మరోసారి గ్రూపు విభేదాలు బహిర్గతం అయ్యాయి. ప్రజల వద్దకు ఎమ్మెల్యేలు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించాలని వైసిపి ప్రభుత్వం గడప గడప మన ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. అయితే గ్రూపుల పోరు వల్ల గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం పగిడ్యాల మండలంలో సక్రమంగా సాగడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

నందికొట్కూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే తోగురు ఆర్థర్, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డిలు అధికార పార్టీ వైసిపిలో గ్రూపుల పోరు కొనసాగుతుంది. గ్రూపుల పోరు వల్ల ఎమ్మెల్యే నిర్వహిస్తున్న గడప గడప మన ప్రభుత్వ కార్యక్రమానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. బుధవారం పగిడ్యాల మండల లక్ష్మాపురం సచివాలయం-2లో (ప్రాతకోట గ్రామం) జరగాల్సిన గడప గడప మన ప్రభుత్వం వాలంటీర్లు హాజరు కానందుకు వాయిదా పడింది. లక్ష్మాపురం సచివాలయం-2 పరిధిలో 27 మంది వాలంటీర్లు ఉన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వాలంటీర్లు అందరూ హాజరు కావాలని ఎంపిడిఒ వెంకటరమణ రెండు రోజుల ముందు నోటీసులు జారీ చేశారు. ముగ్గురు వాలంటీర్లు మాత్రమే ఆ కార్యక్రమానికి హాజరయ్యేందుకు సచివాలయనికి వచ్చారు. ప్రాతకోట గ్రామానికి చెందిన శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి గ్రూపు వారు ఎమ్మెల్యే హాజరవుతున్న గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమానికి హాజర్ కావద్దని ఆదేశాలు జారీ చేయడంతో 27 మందిలో వాలంటీర్లలో 24 మంది హాజరు కాలేదు. వాలంటీర్లకు అధికారులు ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్విచ్చాప్ రావడంతో ఎమ్మెల్యే ఆర్థర్‌కు సమచారం అందించారు. దీంతో వాలంటీర్లు అందరూ పాల్గొంటేనే వస్తానని చెప్పడంతో కార్యక్రమాన్ని అధికారులు వాయిదా వేశారు. గత ఫిబ్రవరి 2న నెహ్రునగర్ గ్రామానికి గడప గడప మన ప్రభుత్వం నిర్వహించేందుకు ఎమ్మెల్యే ఆర్థర్ హాజరు కావడంతో వాలంటీర్లు ఎవరూ రాకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసి వెళ్లిపోయారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు గ్రూపుల ఆధిపత్యం అడ్డంకిగా ఏర్పడడంతో ప్రభుత్వనికి ఎంతో చెడ్డపేరు వస్తుందని కింది స్థాయి కార్యకర్తలు పేర్కొంటున్నారు. దళిత ఎమ్మెల్యే అయినందుకే ఇలాంటి కార్యక్రమాలకు వాలంటీర్లను హాజర్ కాకుండా అవమానిస్తున్నారని దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమానికి వాలంటీర్లు గైర్హాజరవుతున్న వారి పేర్లను ఎంపిడిఒ నివేదిక తయారు చేసి ఎమ్మెల్యేకు అందించారు. ఆ నివేదికను ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌కు అందజేసినట్లు సమాచారం. .

సమావేశంలో మాట్లాడుతున్న సునీల్

బాల అకాడమీలో 'స్టీమ్ రోబో ట్రైనింగ్'

ప్రజాశక్తి - నంద్యాల : నంద్యాల పట్టణంలోని పార్క్ రోడ్డు సమీపంలో గల బాలాకాడమీ పాఠశాలలో శనివారం స్టీమ్ రోబో ట్రైనింగ్ ఫౌండమెంటల్, డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌లను విద్యార్థుల కోసం నిర్వహించారు. ఈ ప్రోగ్రామ్స్ 15 రోజులు పాఠశాలలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల కరస్పాండెంట్ ఎంజివి. రవీంద్రనాథ్, ప్రిన్సిపల్ మాధవీలత, యూనిఫస్ట్ కంపెనీ ఎండి. సునీల్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ స్టీమ్ రోబో టెక్నికల్ ప్రైవేట్ లిమిటెడ్ విద్యలో సాంకేతికతను ఉపయోగించుకోవడంపై దృష్టి సారించిన ఒక ఎడ్యుకేషనల్ టెక్నాలజీ కంపెనీ అన్నారు. ఇది విద్యార్థులు స్టీమ్ రోబోటిక్స్, లాట్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో నేర్చుకోవడానికి, ఆవిష్కరించడానికి వీలు కల్పిస్తుందని తెలియజేశారు. సునీల్ మాట్లాడుతూ రోబో టెక్నాలజీ మాలక్ష్యం యువతలో ఉత్సాహం, సృజనాత్మకత, ఊహలను పెంపొందించడం, డిజైన్‌మైండ్ సెట్, కంప్యూటేషనల్ థింకింగ్, అడాప్టివ్ లెర్నింగ్, ఫిజికల్ కంప్యూటింగ్ వంటి వినూత్న నైపుణ్యాలను పెంపొందించడమని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - సంజామల : మండలంలోని మంగపల్లి గ్రామంలో నేడు పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ దస్తగిరి రెడ్డి తెలిపారు. శని వారం ఆయన మాట్లాడుతూ స్త్రీ వ్యాధి నిపుణులు, గుండె వ్యాధి నిపుణులు, గొంతు, ముక్కు, కండరాలు, ఎముకలు, కళ్ళు సంబంధిత డాక్టర్లు వస్తారని, మండలంలోని ప్రజలు, కోయిలకుంట్ల గ్రామ ప్రజలు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు.

రేషన్ పంపిణీలో చిరుధాన్యాలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : మండలంలో ప్రజా పంపిణీ రేషన్ సరుకుల పంపిణీలో భాగంగా మే నెల నుండి నిత్యావసర వస్తువులతో పాటు, చిరుధాన్యాలను కూడా పంపిణీ చేస్తున్నట్లు ఆళ్లగడ్డ సివిల్ సప్లైస్ డిప్యూటీ తాహసిల్దార్ సోమశేఖర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రతి కార్డుదారుడికి ఒక కేజీ జొన్నలను కిలో బియ్యం బదులుగా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని రేషన్ కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జెఇఇలో 'ఎస్‌డిఆర్' విద్యార్థులకు జాతీయ ర్యాంకులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జెఈఈ మెయిన్స్ రెండవ దశ ఫలితాలలో ఎస్‌డిఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాల విద్యార్థులు డి. యశ్వితా రెడ్డి ఆలిండియా 93వ ర్యాంకు, డి.వసంత కుమార్ 977వ ర్యాంకు, జి. లక్ష్మీ ప్రియ 3507వ ర్యాంకులతో పాటుగా పది మంది విద్యార్థులు పది వేల లోపు ర్యాంకులు సాధించి నంద్యాల జిల్లాలోనే అత్యున్నత ర్యాంకులు సాధించారని కళాశాల చైర్మన్ ఎస్.కొండారెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో జరిగిన విద్యార్థుల అభిందన సభకు ముఖ్య అతిథిగా నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి హాజరయ్యారు. విద్యార్థులను పుష్పగుచ్చాలతో అభినందించి జీవితంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, కళాశాల చైర్మన్ కొండారెడ్డి

లక్ష్మీ నరసింహ యాదవ్‌ను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

ఆలయ అభివృద్ధికి కృషి : కాంగ్రెస్

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం సమీపంలో వెలసిన దొర్వి లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామనికాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు లక్ష్మీ నరసింహ యాదవ్ తెలిపారు. శనివారం ఆయన కుటుంబ సమేతంగా దొర్వి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు బండల శీను ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆయనను శాలువా, పూలమాలతో సన్మానించారు. ఆయన వెంట ఆళ్లగడ్డ తాలూకా అధ్యక్షులు గంధం మల్లేశ్వర రెడ్డి పలువురు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఇంటర్‌లో 'నేషనల్' విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి - నంద్యాల

ఇంటర్ ఫలితాలలో నంద్యాల శ్రీనివాస్ నగర్‌లోని నేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారని కళాశాల చైర్మన్ డాక్టర్ ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు. శనివారం ఆయన కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు గాను ముస్కాన్ 449, ముబీనా కౌసర్ 447 మార్కులు, సీఈసీలో 500కు నాగాంజలి 444 , షరీఫ్ 414, హెచ్‌సిఎంఎల్ లో సాహిల్ 447 ,హీన 425, సియస్ఈలో సుహాన 445 , విష్ణువర్ధన్ 444, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ లో సుదర్శన్ 449 , శ్రావణి 442తో పాటు ఇంకా చాలామంది విద్యార్థులు మంచి మార్కులు సాధించారని అన్నారు. రెండవ సంవత్సరం ఎంపీసీలో అశోక్ 892, బైపీసీలో కరిష్మా 894, హెచ్‌సిఎంఎల్‌లో తస్లీమ్ 900, సిఎస్ఇలో ఫెరోజ్ 939, ఇమ్రాన్ 926, ఎంఎల్‌టిలో అజయ్ 922 మార్కులు సాధించి కళాశాల ఖ్యాతిని ఇనుమడింప చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఈ విజయాన్ని సాధించిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన అధ్యాపక బందాన్ని అభినందించారు.

మెగా పీపుల్స్ సర్వే ఫలితాల్లో నంద్యాల

పార్లమెంటు ప్రథమం.. అసెంబ్లీ 9వ స్థానం

- నంద్యాల ఎంపీ, ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్రవ్యాప్తంగా వైసిపి చేపట్టిన మెగా పీపుల్స్ సర్వే ఫలితాల్లో నంద్యాల పార్లమెంట్ సెగ్మెంట్ ప్రథమం, అసెంబ్లీ 9వ స్థానంలో వచ్చినట్లు ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా తెలిపారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. క్షేత్రస్థాయిలో వైసిపి క్యాడర్ నిబద్ధతగా, నిష్పక్షపాతంగా మెగా పీపుల్స్ సర్వేను నిర్వహించినట్లు చెప్పారు. సర్వేకు అపూర్వ స్పందన వచ్చిందన్నారు. రాష్ట్ర ప్రజలు వారి భవిష్యత్తు కోసం జగనన్నను మాత్రమే విశ్వసిస్తున్నామని చెప్పడానికి ఇదే సాక్ష్యమన్నారు. ఈ మెగా పీపుల్ సర్వేతో ప్రతిపక్షాలకు షాక్ కొట్టినట్లు అయిందని అన్నారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాబన్నీసా, కన్వీనర్లు సలాముల్లా, రాజశేఖర్ రెడ్డి, బసవేశ్వర్ రెడ్డి, వైసిపి నాయకులు నందం బాబురావు, గృహ సారథులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా

ఈదురు గాలులు - నేలకొరిగిన అరటి తోటలు

ప్రజాశక్తి - మహానంది : మహానంది మండలం తిమ్మాపురం, కృష్ణనంది పరిసర ప్రాంతాలలో శనివారం తీవ్ర ఈదురు గాలులు వీచాయి. అరటి తోటల్లో చెట్లు నేలకొరిగాయి. దీంతో అరటి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట పొలాల్లో ఈదురు గాలుల వల్ల అరటి చెట్లు నేలకొరిగి పంటలు నేలపాలయింది. చేతికి అందివచ్చిన పంట కళ్ళముందే పనికి రాకుండా పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల ఈదురు గాలులతో నష్టపోయామని, అరటి రైతులను ప్రభుత్వమే వెంటనే ఆదుకోవాలని కోరుతున్నారు.

రిసోర్స్ భవనంలో రచ్చ రచ్చ..

- ఎంఇఒ, ఎంఐఎస్ ఆపరేటర్‌కు గొడవ
- విలేకరుల ఎదుటే బూతులు తిట్టుకున్న వైనం

ప్రజాశక్తి - అవుకు

విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులు అంటే సభ్య సమాజంలో ఎంతో గౌరవ మర్యాదలు ఉన్నాయి. అటువంటి ఉపాధ్యాయులకు మండల కేంద్రంలో రిసోర్స్ భవనం ఏర్పాటు చేశారు. ఇందులో విద్యాశాఖ అధికారి, ఎమ్మార్సీలు, కంప్యూటర్ ఆపరేటర్ ఉంటున్నారు. గత కొంతకాలంగా వీరిలో ఒకరిపట్ల ఒకరికి విభేదాలు పెరిగి కార్యాలయంలోనే ఏకంగా దూషించుకున్న స్థాయికి చేరుకుంది. అవుకు పట్టణంలోని మండల రిసోర్స్ కేంద్రంలో శనివారం బాహాబాహిగా ఘర్షణ పడ్డారు. వివరాలు.. మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్ రావు ఎంఐఎస్ ఆపరేటర్ సుబ్బరాయుడుల మధ్య చిన్న చిన్న మాటల యుద్ధం ప్రారంభమై చివరకు ఒకరిపై ఒకరు తారాస్థాయిలో దూషించుకుంటూ, గట్టిగా కేకలు వేస్తూ కార్యాలయాన్ని రచ్చరచ్చ చేశారు. ఎంఐఎస్ ఆపరేటర్ మూడు కుర్చీలను ఒకదానిపై ఒకటి వేసుకొని కూర్చుని కంప్యూటర్ ముందర పనులు చేసుకుంటూ ఉండటాన్ని గమనించిన ఎంఇఒ అన్ని కుర్చీలు వేసుకుని చేయాల్సిన అవసరం ఏమిటని, ఒక కుర్చీలో కూర్చో అన్నారు. దీంతో ఒకరిపై ఒకరు దూషించుకోవడం మొదలు పెట్టారు. విషయం తెలిసిన అక్కడికి చేరుకున్న విలేకరుల ఎదుటనే ఒకరికొకరు తీవ్రస్థాయిలో దూషించుకోవడం, కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలను బహిర్గతం చేస్తానని ఎంఐఎస్ ఆపరేటర్ ఆవేశంతో అనడంతో అందరూ ముక్కున వేలేసుకున్నారు. వెంటనే ఎంఇఒ 'నీకు దిక్కు ఉన్న చోట చెప్పుకోపో.. నీకు ఇష్టం వచ్చిన పని చేసుకో.. ఒక మండల స్థాయి అధికారిని కిందిస్థాయి సిబ్బందివి ఎంత మాత్రం మర్యాద ఇవ్వకుండా ఇష్టం వచ్చిన రీతిలో దూషిస్తావా.. నీపై చర్యలు తీసుకుంటా..' అని అన్నారు. ఎంఐఎస్ ఆపరేటర్ మాట్లాడుతూ 'నీవు, ఎంఆర్‌సిలు కలిసి చేస్తున్న అక్రమాలు రుజువులతో సహా అన్ని బహిర్గతం చేస్తా' అన్నాడు. ఇటువంటి సంఘటన విద్యాశాఖ భవనంలోనే జరగటం విద్యా వ్యవస్థకు కలంకమని పలువురు విమర్శిస్తున్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లా స్థాయి అధికారులు విచారణ చేసి నిజానిజాలను బయటకు తీసి అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గొడవ పడుతున్న దృశ్యం

పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

ప్రతి ఇంటికి నేరుగా సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - ఆత్మకూరు

దళారులు లేకుండా నేరుగా లబ్ధిదారుడి ఇంటికే సంక్షేమ పథకాలు చేరుస్తున్నాయని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని 12 వార్డులో ఎమ్మెల్యే మున్సిపాలిటీ చైర్మన్ డాక్టర్ ఆసియా, కౌన్సిలర్లతో గడపగడపకు తిరిగి సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త శిల్పా భువనేశ్వర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మీర్, మండల అధ్యక్షుడు రాజమోహన్ రెడ్డి, జడ్పిటిసి సభ్యుడు శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

గుడిసె వాసులకు సౌకర్యాలు కల్పించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూరు

బిఆర్ఆర్ నగర్ గుడిసె వాసులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలి సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సందిబోయ్యూరు సిపిఎం కార్యాలయం నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం నాగేశ్వరావు, సిపిఎం నాయకులు పి వెంకటేశ్వర్లు, కె భాస్కర్ రెడ్డిలు మాట్లాడారు. బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నగర్ కాలనీలో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్న పేదలకు వెంటనే పట్టాలు ఇవ్వాలని, కాలనీలో సిసి రోడ్లు, మంచినీటి పైపులైను, విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు, మహిళలకు సామూహిక మరుగుదొడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. సమస్యలను త్వరలోనే పరిష్కారం చేస్తామనిచైర్మన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు ఆర్ జయ, ఉసేనమ్మ, లింగమ్మ, ఎస్ఎఫ్ఐ కుమార్, వేణుగోపాల్, ఎం కర్ల, నరసింహులు, ఏసన్న లక్ష్మీదేవి, గౌసియా, సుబ్బమ్మ, కాసిం, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

వినతి పత్రం ఇస్తున్న నాయకులు

జెఇఇ మెయిన్స్‌లో డోన్ హర్షవర్ధన్ ప్రతిభ

ప్రజాశక్తి-డోన్

నంద్యాల జిల్లా డోన్ మెడికల్ రెప్స్ యూనియన్ నాయకుడు ఆర్.రవిశంకర్ కుమారుడు ఆర్.హర్షవర్ధన్ జెఇఇ మెయిన్స్‌లో ఆలిండియా 184 ర్యాంకు సాధించారు. ఏప్రెల్‌లో నిర్వహించిన జెఇఇ మెయిన్స్ పరీక్షల ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. 10 తరగతి గురివాడ కెకెఆర్ గౌతమ్ పాఠశాలలో చదివారు. ఇంటర్ విజయవాడ చైతన్య చైనా క్యాంపులో చదివారు. ఎంపిసిలో వెయ్యి మార్కులకు 961 మార్కులు సాధించారు. ఐఐటి బాంబే, మద్రాస్, ఖరగ్‌పూర్ లాంటి ప్రముఖ కాలేజీల్లో సీటు సాధించి ఇంజనీరింగులో కంప్యూటర్ సైన్స్‌లో చేరుతానని హర్షవర్ధన్ ప్రజాశక్తికి చెప్పారు. డోన్ మెడికల్ రెప్స్ యూనియన్ నాయకులు జెఇఇ మెయిన్స్‌లో ఉత్తమ ర్యాంకు సాధించిన హర్షవర్ధన్‌ను, ఆయన తండ్రి రవిశంకర్‌ను అభినందించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇంతియాజ్ అహమ్మద్

హజ్ యాత్రికులకు ప్రత్యేక సౌకర్యాలు : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - నంద్యాల

రాష్ట్ర ప్రభుత్వం హజ్ యాత్రకు వెళ్లే వారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తుందని ఎమ్మెల్సీ ఇషాక్ బాషా తెలిపారు. హజ్ యాత్రికుల శిక్షణ తరగతులను నేషనల్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్ ఇంతియాజ్ అహ్మద్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ ఇషాక్ బాషా హాజరై తన అనుభవాలను హజ్ యాత్రికులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ గతంలో కేంద్ర ప్రభుత్వం 300 మందికి ఒక వాలంటీర్‌ను నియమించేదని, ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి 150 మందికి ఒక వాలంటీర్‌ను నియమిస్తూ వారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించారని చెప్పారు. నేషనల్ విద్యాసంస్థల చైర్మన్ మాట్లాడుతూ మొట్ట మొదటి సారిగా విజయవాడ గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుండి హజ్ యాత్రకు వెళ్లడంకు అవకాశం రావడం సంతోషకరమైన విషయమన్నారు. అనంతరం నేషనల్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్ ఇంతియాజ్ అహ్మద్, ఎమ్మెల్సీ ఇషాక్ భాషను మౌలానా అబ్దుల్ మజీద్ సాహెబ్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హఫీజ్ అబ్దుల్ సలాం సాహెబ్, నేషనల్ విద్యాసంస్థల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేద మైనార్టీ విద్యార్థులకు జగన్ ద్రోహం

- 1న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నా కార్యక్రమాలు
- టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహమ్మద్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఏపిలో మైనారిటీ విద్యార్థులకు ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ద్రోహం చేశారని టిడిపి మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహమ్మద్ ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎపి ప్రభుత్వ మైనారిటీ శాఖ అలసత్వం వల్ల పేద మైనారిటీ విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లారన్నారు. మైనారిటీ విద్యార్థులకు జరిగిన అన్యాయంపై మే 1న సోమవారం రాష్ట్రవ్యాప్తంగా టిడిపి ఆధ్వర్యంలో నిరసన ధర్నాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా పేద మైనారిటీల విద్యార్థులు ఈసెట్‌ఐఏఎం మైనారిటీ శాఖ ద్వారా ఇంటర్ విద్యార్థులకు పరీక్షల అనంతరం పాలిసెట్, ఈసెట్, ఎంసెట్, నీట్, జెఇఇలో ఉచిత శిక్షణలో ప్రవేశం కోసం రోజు ఆయా సంబంధిత సెంటర్ల వెంట తిరుగుతున్నారని, వారికి ఈ రోజు రేపు అని సమయాన్ని వృధా చేస్తూ ఆఖరికి ఉచిత శిక్షణ లేదని చెప్పడం దారుణమన్నారు. ఉచిత శిక్షణ ఇవ్వకపోవడంపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఒక వైపు ఉర్దూ మీడియం చదివే విద్యార్థులకు ఈ ప్రభుత్వంలో ఇంతవరకు ఉర్దూ భాషలో పాఠ్య పుస్తకాలు అందించడంలో, అలాగే ఉచిత శిక్షణ ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

భూములు చూపాలి : వ్యకాసం

స్పందించని తహశీల్దార్ కార్యాలయానికి తాళం వేసిన దళితులు, బాధితులు

ప్రజాశక్తి - ఆత్మకూరు

గత నాలుగు రోజులుగా దళితులకు ఇచ్చిన పట్టాలకు భూములు చూపాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మిద్దూరు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు దీక్షలు చేపట్టినప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో శనివారం కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శివ నాగరాణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఫకీరు సాహెబ్ మాట్లాడుతూ మండల కేంద్రంలో 45 దళిత, బిసి కుటుంబాలకు చెందిన భూ పంపిణీలో భాగంగా పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చిన భూములు చూపాలని అనేక రూపాల్లో ఆందోళనలు చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. ఈ పట్టాల మీద సొసైటీలో రుణాలు, సబ్సిడీ విత్తనాలు తీసుకోవడం జరిగిందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజా ప్రతినిధులు ఓట్ల కోసం వస్తారే తప్ప ఇంత ఆందోళన చేస్తున్నా ఏ ఒక్క రాజకీయ నాయకుడూ దీక్షల దగ్గరకు వచ్చి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇవ్వలేదన్నారు. అధికారుల నిర్లక్ష్యానికి పేద దళితులు బలి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాలకు భూములు చూపించాలని శాసనసభ్యులు తొగురు ఆర్థర్‌కి, జిల్లా కలెక్టర్, జేసీ, ఆర్డీవోలకు వినతి పత్రాలు ఇచ్చిన సమస్యను పరిష్కరించడం లేదని వాపోయారు. తహశీల్దార్ కార్యాలయానికి తాళం వేయడంతో సిబ్బంది బయట చెట్ల కింద విధులు నిర్వహించారు. తాసిల్దార్ జెసితో చర్చలు జరిపి హామీ ఇస్తానన్నారు. అనంతరం ఎస్సై మారుతి శంకర్, డిప్యూటీ తాసిల్దార్ రమణమ్మ కలిసి ఆర్డిఓకి, తాసిల్దార్‌కి ఫోన్ ద్వారా మాట్లాడి సోమవారం తాసిల్దార్ కార్యాలయంలో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామనిహామీ ఇవ్వడంతో ఆందోళన విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఓబులేసు, సంపంగి వెంకటేశ్వర్లు, దళితులు ఉజ్జనం, తిరుపతయ్య, జయరామయ్య, ఏసన్న, చంద్ర, ఆదిలక్ష్మి, వెంకటమ్మ, దేవమ్మ, మద్దమ్మ, మరియమ్మ, ప్రకాషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సర్దిచెబుతున్న ఎస్సై

మాట్లాడుతున్న నాయకులు

మల్లన్న సన్నిధిలో హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను ఎపి హైకోర్టు న్యాయమూర్తి దుప్పల వెంకటరమణ శనివారం దర్శించుకున్నారు. ముందుగా న్యాయమూర్తి భ్రమరాంబ అతిథి గృహం వద్దకు చేరుకొని, అనంతరం స్వామి అమ్మ వార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకోగా దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న, తదితరులు స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా దర్శించుకున్నారు.

పారిశుద్య కార్మికులకు వేతనాలు పెంచాలి : సిఐటియు

- సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి యేసు రత్నం

ప్రజాశక్తి - పగిడ్యాల

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్య కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే ఇచ్చి, వారి వేతనాలను పెంచాలని సిఐటియు నంద్యాల జిల్లా అధ్యక్షులు వి యేసు రత్నం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ధరలతో పోటీ పడలేక అతి తక్కువ వేతనాలతో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్య కార్మికులకు ప్రభుత్వ జీవో నెంబర్ 560 ప్రకారం కనీస వేతనం రూ.16 వేలు ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు కోరారు. ఫేస్ యాప్ రద్దు చేసి, ప్రభుత్వమే యూనిఫామ్ వేతనాలతో కూడిన సెలవులు మంజూరు చేసి, కార్మికులను పెంచి పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు.

పాఠశాల ఆవరణలో మద్యం సేవిస్తే చర్యలు

ప్రజాశక్తి - పగిడ్యాల

పాఠశాల ఆవరణలో మందుబాబులు మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని ముచ్చుమర్రి ఎస్సై నాగార్జున హెచ్చరించారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. పాఠశాల ఆవరణలో మద్యం సేవించి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. పాఠశాల మైదానం, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణల్లో మద్యం సేవిస్తే తెలియజేయాలని సూచించారు.

బిజెపిని ప్రశ్నించకుంటే దేశం అంధకారం : సిపిఎం

ప్రజాశక్తి - ఆత్మకూరు

బిజెపిని ప్రశ్నించకుంటే దేశ భవిష్యత్తు అంధకారం అవుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం నాగేశ్వరావు అన్నారు. ఈనెల 14 నుండి 30 వరకు బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రచార భేరిలో శనివారం సందికొట్కూరు పట్టణంలో కొత్త బస్టాండ్ దగ్గర భారత్ కాంప్లెక్స్ ఆవరణంలో ముగింపు సభ నిర్వహించారు. ఈ సభకు సిపిఎం వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం నాగేశ్వరావు మాట్లాడుతూ దేశంలో మన ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ప్రతి ఏట్ల కేంద్ర ప్రభుత్వం విధానాలను నిలదీయాలన్నారు. బిజెపి అదాని, అంబానీ లాంటి అధిపతులకు దేశ సంపదను దోచిపెడుతోందన్నారు. ప్రశ్నించే ప్రతి ఒక్కరిని నిరంకుశంగా కేసులు వేస్తూ దాడికి పాల్పడుతూ అణిచివేస్తున్నారన్నారు. నాడు అనేకమంది త్యాగధనులు బ్రిటీష్ వలస పాలనను ఎదిరించి తరిమికొట్టి మనకు స్వాతంత్రం తెచ్చారన్నారు. నేడు అదే స్వాతంత్రం పెను ప్రమాదంలో పడింది దానిని ఈ దేశ ప్రజలమైన మనం కాపాడుకోవడానికి జాతీయోద్యమ స్ఫూర్తితో మళ్ళీ జాతీయస్థాయిలో ఈ కేంద్ర ప్రభుత్వ బిజెపిని గద్దె దింపాలని అన్నారు. సామాన్య ప్రజలకు అండగా ఉండడం పోయి వారి మీదే మోయలేని విధంగా భారాలు వేస్తోందన్నారు. బిజెపి పాలనలో నిరుద్యోగులు, రైతులు ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకాన్ని సైతం మోడీ ప్రభుత్వం అటగెక్కించిందన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు ఎం కర్ల, కెవిపిఎస్ జిల్లా నాయకులు కే. రంగమ్మ గంధం హుస్సేనమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దక్క కుమార్, సిపిఎం నాయకులు జయ,నరసింహ, ఏసన్న, నారాయణ, రవి, లోకేష్ లక్ష్మీదేవి, మస్తాన్, సుబ్బమ్మ,తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం నాగేశ్వరావు

సెలవుల్లో పిల్లలను చదివించాలి

మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ

ప్రజాశక్తి-డోన్

వేసవి సెలవుల్లో పిల్లలను బాగా చదివించాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాతపేట ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ తల్లిదం డ్రులకు సూచించారు. శనివారం డోన్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాతపేట ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడు తూ విద్యార్థులకు ఇచ్చిన గ్రేడింగ్ పుస్తకాలను సెలవుల్లో చదివి రాసి తల్లిదండ్రులకు చూపించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టును తల్లిదండ్రులకు తెలియజేశారు. సీనియర్ ఉపాధ్యాయులు ఎం.వెంకటసుబ్బారెడ్డి,లక్ష్మయ్య, లక్ష్మీకాంత్ రెడ్డి, సుబ్బ రాయుడు, రాఘవేంద్ర, దేవేంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు మరువలేనివి : సెలవుల్లో రోటరీ క్లబ్ సేవలు మరువలేనివని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పాతపేట ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ అన్నారు. జడ్పి ఉన్నత పాఠశాల పాతపేట నందు రోటరీ క్లబ్ అధ్యక్షుడు దశరథరామిరెడ్డి విద్యార్థులకు క్రీడాకిట్ అందించారు. దశరథరామిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో చదువుతో పాటు మానసిక ఉల్లాసం కోసం శారీరకంగా ఎదుగుదల, క్రీడల కోసం క్రీడా కిట్లు అందించడం జరిగిందని తెలిపారు. గతంలో పాఠశాలకు మైక్‌సెట్, డెస్కులను అందజేశామన్నారు. క్రీడా వస్తువులను ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ, వ్యాయామ ఉపాధ్యాయురాలు లక్ష్మీ ప్రభావతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు జింకల కృష్ణశంకర్ గౌడ్, రమేష్‌శంకర్,సీనియర్ ఉపాధ్యాయులు ఎం.వెం కటసుబ్బారెడ్డి, లక్ష్మయ్య, శివప్రసాద్, వెంకటరమణ,లక్ష్మీ కాంత్ రెడ్డి, వెంకటేశ్వర్ గౌడ్,చంద్రశేఖర్ గౌడ్,సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, రాఘవేంద్ర, లక్ష్మీకాంత్ రెడ్డి,సురేష్, ఆదినారాయణ, భాను ప్రకాష్ రెడ్డి,దేవేంద్రప్ప, భారతి, శీలావతమ్మ, మధుసూదన్ రెడ్డి,మద్దిలేటి, శివన్న, సుబ్బారాయుడు, సంజీవరెడ్డి,రామ్మూర్తి పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా, చైర్మన్ డాక్టర్ ఆసియా

ప్రజాశక్తి - ఆత్మకూర్

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆదేశించారు. శనివారం ఆత్మకూరు మున్సిపాలిటీ సమావేశం చైర్మన్ డాక్టర్ ఆసియా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరు అజెండాలకు సంబంధించిన అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి హాజరై మాట్లాడారు. ఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరం అనుకుంటే ట్రాక్టర్ల ద్వారా తాగునీటి సరఫరాను చేయాలని ఆదేశించారు. కాంట్రాక్టర్లకు చేసిన పనులకు బిల్లులు పెట్టాలని సూచన చేశారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ రాజగోపాల్, పువ్వాడి దివ్య, కమిషనర్ శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యుడు ఎంఏ రఫీక్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

ఎంపీపీ తిరుపాలమ్మ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మకూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలపై ఎంపీటీసీలు, సర్పంచులు చర్చించాలన్నారు. గ్రామాల వారీగా నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పలు అంశాలపై ఎమ్మెల్యే సూచించారు. ఈ సమావేశంలో జడ్పిటిసి సభ్యుడు శివశంకర్ రెడ్డి, ఎంపీడీవో మోహన్ కుమార్, తాసిల్దార్ ప్రకాష్ బాబు, డిఎల్పిఒ కవిత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించేందుకు కృషి

-నగర పంచాయతీ చైర్మన్ రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు

బేతంచెర్ల : బేతంచర్ల నగర పంచాయతీలోని అన్ని కాలనీలలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడం జరుగుతుందని బేతంచర్ల నగర పంచాయతీ చైర్మన్ రెడ్డి, కమిషనర్ రమేష్ బాబు తెలిపారు. నగర పంచాయతీ కార్యాలయం నందు చైర్మన్ రెడ్డి అధ్యక్షతన నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. పట్టణంలో కాలనీలల్లోని సమస్యల పరిష్కారం రూపొం దించిన అజెండాల వివరాలను కమిషనర్ రమేష్ బాబు వివరించారు. సంజీవ్ నగర్, బి ఆర్ పేట, వడ్డేపేట, కాలనీలో తాగునీటి సమస్యపై కౌన్సిలర్లు రాంగోపాల్, కోట్ల మధు కమిషనర్ రమేష్ బాబు, చైర్మన్ చలం రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వాటి సమస్యపై కమిషనర్ చైర్మన్ స్పందిస్తూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న తాగుడు సమస్యపై అన్ని జాగ్రత్తలు తీసుకొని పరిష్కరించడం జరుగుతుందని వారు హామీ ఇచ్చారు. కో ఆప్షన్ నెంబర్ పై ఎల్లయ్య మాట్లాడుతూ కాలనీలో కందకం దగ్గర గల కాలువలను శుభ్రపరచడం జాప్యం జరుగుతుందని, వీధి కుక్కల బెడదపై చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ రమేష్ బాబు, చైర్మన్ చలం రెడ్డి మాట్లాడారు. బేతంచెర్ల నగర పంచాయతీని ఆదర్శ నగర పంచాయతీగా తీర్చిదిద్దడానికి కౌన్సిలర్లు, ప్రజలు సహకరించాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు కౌన్సిల్ తీర్మానం చేసింది. ఈ సమావేశంలో అధికారులు, వైస్ చైర్మన్లు నాగ వెంకటేశ్వర్లు, పర్వీన్, కౌన్సిలర్లు హుస్సేన్ బీ మహేశ్వర్లమ్మ, మబీనా శకుంతల చింతల నాగిరెడ్డి, కోట్ల మధు, రాంగోపాల్, రామాంజనేయులు, వై ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వివరిస్తున్న సిపిఎం కోఆప్షన్ నెంబర్ వై ఎల్లయ్య

మేడేను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - బేతంచెర్ల

ప్రపంచ కార్మికుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వై ఎల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆర్ ఈశ్వరయ్య, బేతంచర్ల లారీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వైలి శివాలనాయుడు కార్మికులను కోరారు. శనివారం బేతంచెర్ల మండల కేంద్రంలోని లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో సిఐటియు మండల సహాయ కార్యదర్శి బి. రామాంజ నేయులు అధ్యక్షతన సిఐటియు విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా అనుకూల విధానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వాడవాడలో మేడే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ విధానాలు కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని,కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. హమాలీ,ఆటో,భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి 50 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్క కార్మికునికి పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని,ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసరెడ్డి, జి.నాగరాజులకు లారీ డ్రైవర్లు,క్లీనర్లకు, మేడే రోజున సెలవు దినంగా ప్రకటించాలని లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. బేతంచర్ల నగర పంచాయతీలోని మున్సిపల్ కార్మికులకు మేడే రోజున సెలవు దినంగా ప్రకటించాలని సిఐటియు జిల్లా నాయకులు నగర పంచాయతీ కమిషనర్ ఎల్.రమేష్‌బాబుకి వినతి పత్రం అందజేశారు. సమావేశంలో యూనియన్ల నాయకులు ఎస్.రహం తుల్లా, ఎన్.కె.నాగలక్ష్మి,ఎస్.గుల్జార్ బీ,ఎస్.కె బాష, యస్. పలిరాజు, సుబ్బయ్య,వెంకటరమణ, నాగరాజు,రాజయ్య, నరసింహుడు, తదితరులు పాల్గొన్నారు. **శ్రీశైలం ప్రాజెక్టు:** మేడేను జయప్రదం చేయాలని సిఐటియు మండల అధ్యక్షులు దర్శనం నాగరాజు, కార్యదర్శి చిన్న మారెన్న, సహాయ కార్యదర్శి మల్లికార్జునలు కోరారు. సిఐటియు కార్యాలయంలో వారు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. హనుమంత రెడ్డి, చిన్న గంగులు పాల్గొన్నారు.

రుద్రవరం:ఈనెల 30వ తేదీ ఆదివారం నిర్వహించే మేడే వేడుకలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బాల వెంకట్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి.రామచంద్రుడు, మండల నాయకుడు శంకర్ కోరారు. శనివారం రుద్రవరంలో నిర్వహించిన సిఐటియు కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. రుద్రవరం హైస్కూల్ ఆవరణంలో జరిగే బహిరంగ సభనుజయప్రదం చేయాలని, శ్రీ జయంతి వారోత్సవాలు, మేడే ఉత్సవాలను పురస్కరించుకొని జరుగుతున్న కార్మికుల, కర్షకుల సాంస్కృతిక కార్యక్రమాలను జయప్రదం చేయాలని వారు కోరారు. సమావేశంలో ఓబులేసు, బాషా, పూల ఓబులేస్, వడ్డె శ్రీను, మురళి, కార్మికులు పాల్గొన్నారు.

కార్యకర్తల కృషితోనే మొదటి స్థానం : ఎమ్మెల్యే

సచివాలయ కన్వీనర్ ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, మాజీ మంత్రి రామ సుబ్బారెడ్డి లు

ప్రజాశక్తి - బనగానపల్లె

బనగానపల్లె నియోజకవర్గం జగనన్నే మా భవిష్యత్తు పీపుల్స్ సర్వేలో రాష్ట్రంలో మొదటి స్థానం రావడానికి కార్యకర్తలు, గృహ సారథులు, సచివాలయ, మండల సచివాలయ కన్వీనర్లు, నాయకుల కృషేనని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన సక్సెస్ మీట్‌ను నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నంద్యాల జిల్లా పార్టీ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ,జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, బనగానపల్లె నియోజకవర్గ కోఆర్డినేటర్ అఫ్జల్ ఖాన్‌లు పాల్గొన్నారు. రాష్ట్రంలోనే మిస్డ్ కాల్ కార్యక్రమంలో మొదటి స్థానం కొనసాగుతున్నందుకు కృషి చేసిన మండల సచివాలయ కన్వీనర్లను, శాలువా కప్పి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జిల్లా పరిషత్ చైర్మన్, నియోజకవర్గ కోఆర్డినేటర్లు సత్కరించారు. కార్యక్రమంలో వైసిపి ఆవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, ఎపి ఇరిగేషన్ కార్పొరేషన్ చైర్మన్ కర్రా గిరిజా, వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి, ఆవుకు జెడ్పిటిసి వల్లా శ్రీలక్ష్మి, రాష్ట్ర యువజన కార్యదర్శి పోచా శేఖర్ రెడ్డి, జిల్లా ఓవర్సీస్ అధ్యక్షుడు గుండం నాగేశ్వర రెడ్డి, బనగానపల్లె ఎంపిపి మానసవీణ, కోయిలకుంట్ల పట్టణ ఉప సర్పంచ్ జనార్ధన్ సూర్యనారాయణ రెడ్డి, వైసిపి నాయకులు డాక్టర్ మమ్మ హుస్సేన్, అబ్బుల్ ఫైజ్, అత్తార్ జాఫర్ హుస్సేన్, ఉమ్మడి జిల్లాల ఎంపిటిసిల సంఘం అధ్యక్షుడు గోవిందం గోపాల్ రెడ్డి, కోవెలకుంట్ల, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల మండలాల సచివాలయ కన్వీనర్లు లాయర్ మధుసూదన్ రెడ్డి, తల్లం సుబ్రహ్మణ్యం, మిలక రాజారెడ్డి, దారెడ్డి సుధాకర్ రెడ్డి, ఇల్లూరు కొత్తపేట తమ్మడపల్లె సర్పంచులు రమణ, వెంకటరామిరెడ్డి, వైసిపి నాయకులు బండి బ్రహ్మానంద రెడ్డి జిల్లెల్ల శంకర్ రెడ్డి, పాతపాడు వెంకటేశ్వర రెడ్డి, జోలాపురం తిరుపాల్, తిమ్మాపురం సురేష్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** రాష్ట్రంలో ఆళ్లగడ్డ నియోజకవర్గాన్ని 10వ స్థానంలో నిలిపిన వైసిపి కార్యకర్తలకు, నాయకులకు, కన్వీనర్లకు, గృహ సారథులకు ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో 'జగనన్నే మా భవిష్యత్తు' ముగింపు కార్యక్రమం సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిశీలకులు గౌ.కొండారెడ్డి, వైసిపి స్టేట్ మైనార్టీ జనరల్ సెక్రెటరీ షేక్ బాబులాల్, మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవ రెడ్డి, ఆళ్లగడ్డ టౌన్ కన్వీనర్ గోట్లూరు సుధాకర్ రెడ్డి, సిరివెళ్ల ఎంపిపి ఎస్‌వి. చంద్రారెడ్డి, ఎంపిపి అమర్నాథ్ రెడ్డి, చాగలమర్రి మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, ఆళ్లగడ్డ మండల కన్వీనర్ రామకృష్ణ, గంగుల రామిరెడ్డి, ప్రసాద్ రెడ్డి, బత్తుల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల

IN THE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE : DHONE
O.S. No. 610/2022
Andhra Pragathi Grameena Bank Rep by its Branch Manager, Veldurthi ..... Plaintiff
Vs
1) Madiga Bala Krishna @ Madiga Balu aged about 46 years S/o. M.Pullappa @Yellappa Hindu Agriculturist, R/o. Madapuram Village Now at : Sai Nagar Back Side of Sai Baba Temple, NH-44, Dhone Town. ..... Defendant

ప్రతివాదికి నోటీసు
పై దావాను వాది అయిన బ్యాంకు ద్వారా లోన్ అగ్రిమెంటుపై సీవు తీసుకున్న అప్పును రాబోట దావా దాఖలు చేసినారు. నీకు కోర్టు వారు సమన్స్ పంపిన తీసుకొనందున ఈ పేపరు ద్వారా కోర్టు సమన్స్ ఇవ్వడం జరిగినది. కావున 15-06-2023వ తేదీ రోజున పై కోర్టు నందు ఉదయం 10-30 గంటలకు నీవు కాని నీతరఫున న్యాయవాది కాని హాజరై ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలెను. లేనియెడల నీ పరోక్షమందు తీర్మానించబడును.
కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేది : 15-06-2023
M. GOPAL REDDY
Advocate
డోన్ - 518222, నంద్యాల జిల్లా.
Cell : 9440557898

IN THE COURT OF SENIOR CIVIL JUDGE: DHONE.
EA NO 13/2023 IN EP NO 159/2015
IN OS NO 83/2014
1. Dudekula Mahaboob Bee, aged about 44 years, W/O Late Dudekula Gokari, Muslim, house wife mandal, Kurnool district, R/O H/NO 26-139-A, Chigurumanpeta, Dhone town and Mandyal, Kurnool Dist.
2. Dudekula Amisha, aged about 19 years, D/O Late Dudekula Gokari, Muslim, Student, R/O H/NO 26-139-A, Chigurumanpeta, Dhone town and mandal, Kurnool district.
3. Dudekula Rajiya, aged about 21 years, D/O Late Dudekula Gokari, Muslim, Student house wife, R/O H/NO 26-139-A, Chigurumanpeta, Dhone town and mandal, Kurnool district.
4. Dudekula Resma, aged about 25 years, D/O Late Dudekula Gokari, Muslim, house wife Kurnool district, R/O H/NO 26-139-A, Chigurumanpeta, Dhone town and mandal.
6. Dudekula Malan Bee, aged about 28 years, D/O Late Dudekula Gokari, Muslim, house wife, R/O H/NO 26-139-A, Chigurumanpeta, Dhone town and mandal, Kurnool district.
.... Petitioner/Third Parties
- Vs. -
Yerur China Lalenna, S/O Yerur Pedda Thippanna, aged about 70 years, cultivation, R/O Maddikera village and mandal, Kurnool district.
.... Respondent No 1/Decree Holder
Kadavakallu Latha, W/O Kadavakallu Ramudu, aged about 50 years, house wife R/O D-NO 26-91-2, Chigurumanpeta, Dhone town, Kurnool district.
.... Respondent No 2/Judgement Debtor
Notice to Respondent No.2 /Judgement Debtor U/S 151 C.P.C.
పై కనబరచిన Execution Petition నందు Respondent No.1/Decree Holder Executive Petition Schedule Property ని Sale చేసి Sale Certificate ని Sub Registrar Office Dhone Document No. 22/2017 గా Entry అయివున్న తర్వాత Respondent No.1/Decree Holder Sale ని Cancel చేసుకొన్నారు. కావున ఆ విషయము Sub Registrar Office Dhone వారికి తెలియపరచలేదు. ఆ Entry ని Remove చేయుటకు Petitioners/Third Parties పై Petition వేసి యున్నారు. పై Petition 8/5/2023 తేదిన పై కోర్టు వారి ముందు విచారణ ఉదయం 10-30 గంటలకు స్వతహా కాని వకీలు ద్వారా కాని హాజరు కావలెను. హాజరు కానియెడల మీరు లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియచేయడం అయినది.
By Court Order
G. MADHUSUDHANA RAO, B.A., B.L.,
Advocate & Notary
Appointed by Govt. of A.P.G.O.M.S. No. 488, D.No.4-187-3-1, Opp. Siddartha High School, Sundharsing Colony, Dhone-518 222. Kurnool Dist. A.P.